RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 348 ఆదివారం 20 - 07 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం

- రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చే ప్రమాణస్వీకారం
- గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు
- హైకోర్టు న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇటీవల ఐదు హైకోర్టులకు కొత్త సీజేలను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు



తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ - మిగతా 2 లో

## 2026లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం

- నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి
- కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అని వ్యాఖ్య
- త్వరలో 150 లోకోమోటివ్‌లు ఎగుమతి అవుతాయని వెల్లడి
- కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ 40 ఏళ్ల పోరాటమని గుర్తు చేశారు
- రైల్వే వ్యాగన్లు, కోచ్‌లు, ఇంజిన్ల తయారీ పరిశ్రమను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంజూరు చేశారు



కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో 2026లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులు కేంద్ర మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ పరిశ్రమ వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. కాజీపేటలో మెగా రైల్వే కోచ్ ఫ్యాక్టరీని కేంద్రం నిర్మిస్తోందని ఆయన పేర్కొన్నారు.పనులు వేగంగా సాగుతున్నట్లు ఆయన తెలిపారు. 2026లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఆయన - మిగతా 2 లో

## మహనీయులకు అవమానాలు జరుగుతున్నాయి

- గంభీరావుపేటలో జయశంకర్ విగ్రహ గద్దె కూల్చివేత
- అనుమతులు లేవంటూ కూల్చివేసిన అధికారులు
- గద్దెను కూల్చివేయడం దారుణమన్న కవిత
- జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు అనుమతిని ఇవ్వాలని
- గద్దెను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


2 లో

## ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్


2 లో

42 దేశాలు తిరిగొచ్చారు
కానీ, ఇంతవరకు
మణిపూర్‌కు వెళ్లలేదు
మణిపూర్‌లో గత
కొంతకాలంగా హింసాత్మక
సంఘటనలు, గిరిజన
సమస్యలు, రాజకీయ అస్థిరతలు
కొనసాగుతున్నాయి
మణిపూర్ సమస్యలను
పరిష్కరించడంలో కేంద్రం
విఫలమైందన్నారు ఖర్గే

## ఒక్క కంకికి 1000 గింజలు

- ఎకరానికి 10 టన్నుల దిగుబడి
- కొత్త వంగడం వచ్చేస్తోంది!
- అధిక దిగుబడినిచ్చే వరి వంగడం అభివృద్ధి దిశగా పరిశోధనలు
- వరిలో కొత్త చరిత్ర దిశగా ప్రస్తుత రకాలతో
- పోల్చితే రెట్టింపు ఉత్పత్తి!
- 2027 డిసెంబర్‌లోగా అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు



ఆరుగాలం ఎంతో శ్రమపడి పండించిన పంట చివరికి చేతికొచ్చేసరికి తగిన దిగుబడి రాకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్న రైతులెందరో. కానీ ఇకపై అలాంటి అవసరం ఉండకపోవచ్చు. మీ కోసమే భారత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కొత్త తరహా వంగడాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దీని ప్రత్యేకత ఏంటంటే చీడపీడలను తట్టుకుని వరి దిగుబడిని పెంచడమే. అసలేంటి ఆ కొత్త రకం విత్తనం మరి వాటి ప్రత్యేకతలేంటో ఇప్పుడు తెలుసుకుందామా?సరికొత్త వంగడం అభివృద్ధి : ఒక ఎకరం భూమిలో సాధారణ రకం వరి విత్తనాలు వేస్తే ఇటీవల కాలంలో కంకికి 150-200 వడ్ల గింజలు దిగుబడి వస్తుంది. మొత్తం సుమారుగా 2 నుంచి 2.5 టన్నుల వరి దిగుబడి వస్తోంది. గత సంవత్సరం అక్టోబరు నెలలో విడుదలైన డీఆర్‌ఆర్ ధాన్ 75, 76 రకాల్లో వరి కంకికి 450-500 గింజలు వస్తున్నాయి. వీటి ద్వారా 3.5 నుంచి 4.5 టన్నుల మేరకు దిగుబడి వస్తోంది. భారత వరి పరిశోధన సంస్థ (ఇండియన్? ఇన్?స్టిట్యూట్? ఆఫ్? రైస్? రీసెర్చ్?)లో దీనికి రెట్టింపు స్థాయిలో వరి కంకికి వెయ్యి గింజలతో ఎకరానికి 10 టన్నుల మేరకు భారీ ఉత్పత్తి సాధించే దిశగా ఈ కొత్త వంగడం సిద్ధమవుతోంది.

**కొత్త రకం వరి వంగడం**

వీటిపై ప్రాథమిక ప్రయోగాలు పూర్తయ్యాయి. తుది ఫలితాల అనంతరం మరో రెండు సంవత్సరాల్లో ఈ రకం వంగడాలు అందుబాటులోకి తీసుకురానుంది. హైబ్రిడ్‌లో కాకుండా సంప్రదాయ రకాల కలయిక ద్వారా ఈ సంస్థ సైంటిస్ట్?లు కొత్త రకాన్ని సృష్టిస్తున్నారు. తక్కువ కాలవ్యవధిలో సాగయ్యే సన్న రకంగా తెగుళ్లను తట్టుకునే విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. - మిగతా 2 లో

## గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో చెలరేగిన మంటలు



- రైళ్ల రాకపోకలకు అంతరాయం
- గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రమాదం
- పైలట్ అప్రమత్తతతో తప్పిన పెద్ద డేంజర్?!
- కోచ్‌లను ఇంజిన్ నుంచి తొలగించిన అధికారులు
- రాజస్థాన్‌లో బీవర్ జిల్లాలోని ఓ రైలు అగ్ని ప్రమాదానికి గురైంది
- ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు

రాజస్థాన్‌లో బీవర్ జిల్లాలోని ఓ రైలు అగ్ని ప్రమాదానికి గురైంది. పైలట్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. పైలట్ రైలును నిలిపివేసి కంట్రోల్? రూమ్?కి సమాచారం ఇవ్వగా, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. కాగా ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.బీవర్ జిల్లాలో శనివారం ఉదయం సెంద్ర రైల్వే స్టేషన్ సమీపంలో రైళ్లో అగ్ని ప్రమాదం జరిగింది. ముంబయి-దిల్లీకి వెళ్లే - మిగతా 2 లో

## ఏపీ ఆర్థికాభివృద్ధిలో సీఏలు భాగస్వామ్యం కావాలి

- ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్ హౌస్ ఐసీఏఐ
- 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ లక్ష్యమన్న మంత్రి లోకేశ్
- జనవరిలో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్ వస్తోందని వెల్లడి
- ఐసీఏఐ 'స్ఫూర్తి' మెగా కాన్ఫరెన్స్ లో మంత్రి లోకేశ్ ప్రసంగం
- ది ఇన్ స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిది
- సౌత్ ఆసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోంది
- మార్పు కోసం వేచిచూడకుండా ఇక్కడ నుంచే మార్పునకు శ్రీకారం చుడుతున్నాం




ది ఇన్ స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిది. ఐసీఏఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ నవ్యోత్సాహంతో ఉంది. ఇది భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్ గా ఉందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గుంటూరు బండ్లమూడి గార్డెన్స్ లో ఐసీఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన 'స్ఫూర్తి' పేరుతో నిర్వహించిన మెగా సీఏ విద్యార్థుల సమావేశానికి మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా - మిగతా 2 లో

## నేరస్థులు, హత్యా రాజకీయాలు చేసే వాళ్లు అవసరమా?

- రాజకీయాలు కలుషితమైపోయాయని, నేరచరిత్ర ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు
- నేర రాజకీయాలు చేసేవారు మనకు అవసరమా?అంటూ ఆయన ప్రశ్నించారు
- ఏపీని స్వచ్ఛాంధ్రగా మారుస్తూ అనేక అవార్డులు సాధిస్తున్నామని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు
- రాష్ట్రాభివృద్ధి కోసం ఒక్కో నెల ఒక్కో కార్యక్రమం చేపట్టామన్నారు
- 'పర్యావరణాన్ని కాపాడుదాం.. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం' అని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు
- 120 మైక్రాన్ ఉన్న కవర్లను పూర్తిగా నిలిపేద్దామన్నారు
- తిరుపతిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం



రాజకీయాలు కలుషితమైపోయాయని, నేరచరిత్ర ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చారని సీఎం చంద్రబాబు అన్నారు. నేర రాజకీయాలు చేసేవారు మనకు అవసరమా? అంటూ ఆయన ప్రశ్నించారు.తిరుపతిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం చేశారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. ఏపీని స్వచ్ఛాంధ్రగా మారుస్తూ అనేక అవార్డులు సాధిస్తున్నామని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఏపీకి ఐదు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయని, అవార్డులు సాధించిన వారందరికీ అభినందనలు తెలియజేశారు సీఎం చంద్రబాబు. రాష్ట్రాభివృద్ధి కోసం ఒక్కో నెల ఒక్కో కార్యక్రమం చేపట్టామన్నారు.'పర్యావరణాన్ని కాపాడుదాం.. - మిగతా 2 లో

## నలుగురు అన్యమత ఉద్యోగులని సస్పెండ్ చేసిన టీటీడీ


2 లో

వీరు టీటీడీ ప్రవర్తనా నియమావళిని
పాటించకపోవడంతోనే సస్పెండ్
చేశామని టీటీడీ
అధికారులు తెలిపారు
హిందూ ధార్మిక సంస్థకు
ప్రాతినిధ్యం వహించే ఉద్యోగులుగా
విధులు నిర్వర్తిస్తూ
బాధ్యతారహితంగా
వ్యవహరించారని చెప్పారు
నిబంధనల ప్రకారం వారిపై
శాఖాపరమైన చర్యలు
తీసుకోవడంతో పాటు సదరు
నలుగురు ఉద్యోగులను
తక్షణమే సస్పెండ్

# సంపాదకీయం

## మతరాజ్య భావన ఒక మానసిక దౌర్బల్యం

'భావజాల మార్పుతోనే హిందూరాజ్య స్థాపన' శీర్షికతో జూల్కై 11న దోర్బల బాలశేఖరశర్మ రాసిన అంశాలు దేశంలో విద్వేష ప్రచారానికి జనాలు ఎంతగా లోన్కెందీ వెల్లడిస్తున్నాయి. గత చరిత్రను చూసినపుడు భారత ఉపఖండంలో వివిధ మతాలను అవలంబించిన రాజులు ఉన్నారు తప్ప మత రాజ్యాలు ఉన్నట్లు చరిత్ర లేదు. కొన్ని దేశాల్లో ఉన్న ఇస్లామిక్, క్రైస్తవ, బౌద్ధ మతాలను అధికారికంగా ప్రకటించటాన్ని చూసి భారత్‌లో హిందూ రాజ్య స్థాపన చేయాలని కొందరు విదేశీ భావజాలాన్ని కాపీకొట్టి (ఆర్ఎస్ఎస్ వారు వేసుకొన్న నిక్కర్లు, ఇప్పటి పాంట్లు కూడా విదేశీ కాపీ తప్ప మన వస్త్రధారణ కాదు), గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే 101వ సారి నిజంగా మారుతుందట. హిందూ, ముస్లిం, క్రైస్తవం, సిక్కు ఎవరైనా తమ మత రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారంటే దురహంకారవాదపు ప్రతికూల ప్రభావంతో తలెత్తే ఒక మానసిక దౌర్బల్యానికి చిహ్నం తప్ప మరొకటి కాదు. అది మతానికే పరిమితం కాదు, చివరకు కులాల రాజ్యాలు ఏర్పాటు జరగాలన్న దిగజారుడుకూ దారితీస్తుంది.సోషలిజం అన్నది భారతీయ ఆర్థిక ఆలోచన కాదని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ వాదించినట్లు రచయిత పేర్కొన్నారు. ఇదొక అర్థం లేని వాదన. ఒక్కో దేశానికి ఒక్కో ఆర్థిక ఆలోచన ఉండదు. ప్రపంచమంతా ఒక కుగ్రామం అని చెబుతున్న రోజుల్లో ఇలాంటి కబుర్లు చెప్పటం జనాలను మభ్యపెట్టే అతితెలివి తప్ప మరొకటి కాదు. పొలంలో పని చేసేవాడు ఎక్కడ్కెనా వ్యవసాయ కార్మికుడే, అలాగే అమెరికాలో అయినా అనకాపల్లిలో అయినా ఫ్యాక్టరీ పనివాడు పారిశ్రామిక కార్మికుడే. పెట్టుబడి, లాభాలు తప్ప మరొక గీటురాయి ఉండదు. సోషలిజం కూడా అలాంటిదే. భారతదేశం ఎల్లపుడూ సర్వోదయ, అంత్యోదయ సూత్రాలను అవలంబించిందని కూడా అసోం సీఎం చెప్పారట. సర్వేజనా సుఖినో భవంతు అని సోషలిస్టు భావన కంటే ముందే చెప్పారు. అయినా దానిలో అందరికీ మంచి జరిగితే అంత్యోదయ, అత్యల్ప వర్గాలు ఎందుకున్నట్లు! బ్రిటిష్ వారి హయాంలో కూడా లేని ఆర్థిక అంతరాలు ఎందుకు పెరుగుతున్నట్లు! లౌకికవాదం దారి తప్పిందట, దాని వలన హిందూ ధర్మానికీ, సమాజానికీ హాని కలుగుతున్నందున దేశాన్ని పూర్తి స్థాయి హైందవ దేశంగా పునరుద్ధరించటం గురించి ఆలోచించాలట. లౌకికవాదం దారితప్పితే గాడిలో పెట్టమని అడగాల్సింది పోయి మతరాజ్యాన్ని ఏర్పాటు చేయాలనటం ఏమిటి? అది కూడా పునరుద్ధరించాలనటం హిమాలయమంత అవాస్తవాన్ని మెదళ్లలోకి ఎక్కించే యత్నం తప్ప మరొకటి కాదు. "భారతదేశంలోకి స్థానభ్రంశం చెందిన ముస్లిం జనాభాకు వక్ఫ్ బోర్డును ప్రసాదించారు. ప్రతిగా స్థానభ్రంశం చెందిన హిందువులకు మాత్రం రిక్తహస్తం చూపించారు. పాకిస్థాన్‌లో ప్రతిదీ వదులుకున్న హిందువులకు శూన్యమే మిగిలింది" అని వ్యాసకర్త అనటానికి ఆధారాలు ఏమిటన్నది ప్రశ్న. రాష్ట్రాల వారీగా దేవాదాయ, ధర్మాదాయ సంస్థలకు ఎన్ని భూములు ఉన్నాయో, ఎన్ని ఆస్తులు ఉన్నాయో ఎవరైనా చెబుతున్నారా? వక్ఫ్‌బోర్డుకు భారత్‌లో దానం చేసిన ఆస్తుల నిర్వహణ బాధ్యత ఇచ్చారు తప్ప అదనంగా ఇచ్చిందేమీ లేదు. ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం దేశంలో 8.7లక్షల ఆస్తులు 9.4లక్షల ఎకరాల భూములు ఉన్నాయి, వాటి విలువ రూ.1.2లక్షల కోట్లు. దాన్ని ఒక సంస్థగా చూసి భారతీయ రైల్వేలు, మిలిటరీ తరువాత పెద్దది అని చెబుతున్నారు. దేశంలో దేవాదాయ ధర్మాదాయ ఆస్తుల మొత్తం విలువ ఎంత ఉందో కేంద్ర ప్రభుత్వం క్రోడీకరించి చెప్పిందా? దాని దగ్గర ఉండవచ్చు గానీ ఎక్కడా బయటికి వెల్లడించలేదు. కేంద్ర ప్రభుత్వ ఎన్ఎస్ఎస్ఓ సేకరించిన సమాచారం ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.3.02లక్షల కోట్లు. మన దేశం నుంచి వెళ్లిపోయినవారి ఇక్కడి ఆస్తులను పాకిస్థాన్ వెళ్లినవారికి ఇవ్వలేదు కదా! ఉదాహరణకు హైదరాబాద్ నుంచి పాక్ వెళ్లిన వారి ఇండ్లు, పొలాలను అనేక మంది తరువాత ఆక్రమించి అన్యాక్రాంతం చేసుకున్నారు. వారిలో ముస్లింలు, హిందువులు అందరూ ఉన్నారు. ఇప్పటికీ ఆ వివాదాలు నడుస్తూనే ఉన్నాయి.ఇన్ని దశాబ్దాల అనంతరం కూడా భారతదేశంలో హిందువుల పరిస్థితి మెరుగుపడలేదట. ఇది ఒక మానసిక దాడి, గాలి పోగేయటం తప్ప మరొకటి కాదు. పాకిస్థాన్‌లో ముస్లింలు ఎలా బాగుపడ్డారో రచయిత చెప్పి ఉంటే అర్థం ఉండేది. ఒకవైపు "మతరాజ్యంగా మారిన పాకిస్థాన్ దుస్థితి ఎలా ఉందో చూడండి, మన దేశం ఎలా ముందుకు పోయిందో చూడండి" అంటూ కాషాయదళాలు ప్రచారం చేయటం చూస్తున్నాం. మనదేశాన్ని కూడా మతరాజ్యంగా మార్చటం అంటే మరో పాకిస్థాన్‌గా మార్చాలనేనా? అసలు హిందూరాజ్యం అంటే ఏమిటో, దాని రూపురేఖలు ఎలా ఉంటాయో ఎవరైనా చెప్పగలరా? సామాన్యులకు పట్టింపు లేదు గానీ అసలు సిసలు నిలువుబొట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకొనేవారు అడ్డబొట్ల ఆలయాల గడప తొక్కరన్న పచ్చినిజం ఎంత మందికి తెలుసు? అలాంటప్పుడు ఎవరి భావనలకు అనుగుణంగా మతరాజ్యాన్ని ఏర్పాటు చేస్తారు? దాన్ని రెండవవారు అంగీకరిస్తారా? అలాంటి రాజ్యంలో ఇతర మతాలవారి పరిస్థితి ఎలా ఉంటుంది. హిందువులు మెజారిటీగా ఉన్నప్పటికీ దురవస్థలో ఉన్నారని పదే పదే చెప్పటం గోబెల్స్ ప్రచారం, అందరూ అదే స్థితిలో ఉన్నారు. అన్ని మానవాభివృద్ధి సూచికల్లోను మనం ప్రపంచంలో ఎంత దిగువ స్థానాల్లో ఉన్నామో తెలిసిందే. దేశంలో హిందూ ద్వేష భావం ఉందని చెప్పటం ఒక మైండ్ గేమ్. జనాన్ని తప్పుదారి పట్టించే ఎత్తుగడ. మెజారిటీ వాదం చాలా ప్రమాదకరమైనదని ప్రపంచ అనుభవం చెబుతున్నది. అందువలన మార్చాల్సింది ఈ వాదాన్ని. దీన్ని ఇలాగే కొనసాగనిస్తే దేశ యువత పురోగమనంవైపు గాకుండా తిరోగమనంవైపు తిరిగితే దేశం మరింత అధోగతిలోకి దిగజారుతుంది.సామాన్య భారతీయులకు మతం ఉంది గానీ విద్వేషం లేదు. ఉంటే 2024 ఎన్నికల్లో హిందూత్వకు ప్రమాదం ముంచుకువచ్చిందని చెప్పినా 34శాతం మంది అసలు ఓటింగ్‌కే రాలేదు. బీజేపీకి గత ఎన్నికల కంటే 0.8శాతం తగ్గి వచ్చిన ఓట్లు 36.56శాతంబీ ఇవి కూడా తెలుగుదేశం, జనసేన పార్టీలు వేయించిన ఓట్లు కూడా కలిస్తే. చివరిగా ఒక్క మాట రచయిత హిందూ ద్వేష భావజాలాన్ని నిర్మూలించాలన్నారు. దీనిలో కూడా సంకుచితమేనా! సర్వేజనా సుఖినో భవంతు అనే వారికి మతద్వేషం అనటానికి నోరు రాలేదు. ఒక భావజాలం అది మతవిద్వేషమైనా, మరొకట్కెనా నిర్మూలించటానికి అదేమైనా వస్తువు, ప్రాణి కాదే! చరిత్రలో చార్వాకులను చంపేశారు, వారి గ్రంథాలను తగులబెట్టారు తప్ప వారి భావజాలాన్ని నిర్మూలించగలిగారా! జనం ఆదరించకపోతే ఏద్కెనా వెనక్కు పోతుంది, ఆదరిస్తే మనదేశంలో కవలపిల్లల మాదిరి మెజారిటీ, మైనారిటీ మతవిద్వేషం రెచ్చిపోతుంది!

# ఏపీ ఆర్థికాభివృద్ధిలో సీఏలు భాగస్వామ్యం కావాలి

మొదటిపేజీ తరువాయి – మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఐసీఏఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందింది. ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ ఇది. ఐసీఏఐ ద్వారా 10 లక్షల మందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా, ప్రతియేటా 2 లక్షలమంది పరీక్షలు రాస్తున్నారు. 4.07 లక్షల మంది సభ్యులు, 54 విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థ ఐసీఏఐ.

**సీఏ కోర్సు నిబద్ధతతో కూడుకున్న విద్య**

భారతదేశం గర్వించదగిన ఐసీఏఐ కుటుంబ సభ్యులు అందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నేను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్ఫోర్డ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్ గా సీఏ ప్రాధాన్యత నాకు తెలుసు. ఇది కేవలం ఒక కోర్సు కాదు, నిబద్ధతతో కూడుకున్న విద్య. మా కుటుంబ వ్యాపారాల్లో సీఏల కష్టాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. వ్యాపారాల్లో స్పష్టత లోపించినపుడు మేము సీఏ వైపే చూస్తాము. పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతి ప్రభుత్వ ఫైల్‌కు ఆడిటర్ల ఆమోద ముద్ర అవసరం. సీఏలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదు, వారు ఆర్థిక వృద్ధి చోదకులు. వారు వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి సహాయం చేస్తారు.

**చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరు**

భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరు నగరం. ఆశ్చర్యకరంగా గుంటూరు సిటీ వైద్యులు, ఇంజనీర్ల కంటే ఎక్కువగా సీఏలను తయారు చేస్తోంది. డాక్టర్లు, ఇంజనీర్లకంటే సీఏ చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువ. 10 వేల మంది సీఏ చదువుతున్నారు. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణత శాతంతో సమున్నత లక్ష్యాలు కలిగిన చార్టర్డ్ అకౌంటెంట్లు గుంటూరుకే సొంతం. గుంటూరు నుంచి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు సీఏలు భారతదేశం గర్వపడేలా ప్రతిభను చాటుతున్నారు. సీఏ వృత్తిలో ప్రవేశించడం కష్టం, విస్మరించడం అసాధ్యం. వజ్రాన్ని తయారుచేయడం ఎంతకష్టమో సీఏ డిగ్రీ సాధించడం కూడా అంతే కష్టం.

**ఆర్థికాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం**

సీఏ వృత్తి పన్నులు, చట్టం, బ్యాంకింగ్, పెట్టుబడులు, సాంకేతికత, విధానం వంటి రంగాల్లో విస్తరించి ఉంది. ప్రతి బ్యాలెన్స్ షీట్ వెనుక ఒక టాలెంట్ బ్రెయిన్ ఉంటుంది. ఆ బ్రెయిన్ పేరే చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ). వికసిత్ భారత్ లో భాగంగా 2047నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్నది ప్రధాని మోదీ ఆకాంక్ష. కాగా, అందులో 2.4 ట్రిలియన్ డాలర్లు సాధించాలన్నది ఏపీ లక్ష్యం. ఇది కఠినమైనది అయినప్పటికీ అసాధ్యం కాదు. భారతదేశానికి గర్వకారణంగా నిలిచే భవిష్యత్ ఆర్థిక వృద్ధిలో భాగస్వామి కావడం ఏపీ బాధ్యతగా భావిస్తోంది. దేశ ఆర్థికాభివృద్ధిలో ఏపీ ప్రస్తుత వాటా 4.85 శాతం కాగా, 2047 నాటికి 6.67 శాతంగా ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

**క్వాంటమ్‌తో మారనున్న రూపురేఖలు**

సౌత్ ఆసియాలోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోంది. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఇ-గవర్నెన్స్, ఐటీ హబ్‌లతో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన చంద్రబాబు... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపీ రూపురేఖలు మార్చబోతున్నారు. మేం మార్పు కోసం వేచిచూడకుండా ఇక్కడ నుంచే మార్పునకు శ్రీకారం చుడుతున్నాం. పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రాలతో పోటీపడుతున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ముందుకు వెళుతున్నాం. కర్నూలులో డ్రోన్ సిటీ, కడపలో స్టీల్ ప్లాంట్, విశాఖలో ఏఎన్ఎస్ఆర్, సత్వ జీసీసీతో పాటు ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు రాబోతున్నాయి.

**సీఏల భాగస్వామ్యంతో అవినీతికి చెక్**

నేటి ప్రపంచంలో, ఐక్యూ మంచిది, ఈక్యూ మంచిది. కానీ టీక్యూ (టెక్ కోషెంట్) కూడా తప్పనిసరి. పదునుగా, నైతికంగా, తాజాగా ఉండండి. మీరే మా పెట్టుబడి. లక్ష్యసాధనపై దృష్టి కేంద్రీకరించి, ఆచరణాత్మకంగా, సానుకూలంగా ఉండండి. మీరు ఎంచుకున్న ప్రయాణం కష్టమైందే కానీ మీకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. సీనియర్లు, మెంటర్లు, మెరుగైన ఎకోసిస్టమ్ ద్వారా మెళుకువలు నేర్చుకోండి. మీ తల్లిదండ్రులు మిమ్మల్ని నమ్ముతారు, మేము మిమ్మల్ని నమ్ముతాం. సీఏ ఉత్తీర్ణత సాధించడం కేవలం ఒక మైలురాయి కాదు, ఇది మీ జీవితానికి మణిహారం లాంటిది. భారతదేశ ఆర్థికవ్యవస్థకు మీరే గుండెకాయ. సీఏలు పాలనా వ్యవస్థలోకి వస్తే అవినీతిని రూపుమాపడం సులభతరమవుతుంది. మనమంతా కలసి భారతదేశాన్ని, ఆంధ్రప్రదేశ్ ను ప్రగతిపథం వైపు నడిపిద్దాం. ఏపీ ఆర్థికాభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలో సీఏలు భాగస్వాములు కావాలి... అంటూ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ డి. ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచీ ఛైర్మన్ ఎన్. రాజశేఖర్, సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచీ ఛైర్మన్ చింతా రఘునందన్, వైస్ ఛైర్మన్ బి. ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి వి. నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేరస్థులు, హత్యా రాజకీయాలు చేసే వాళ్లు అవసరమా?

మొదటిపేజీ తరువాయి –

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం' అని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు.. ప్లాస్టిక్ ఎక్కువగా వాడితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరమని చంద్రబాబు చెప్పారు. 120 మైక్రాన్ ఉన్న కవర్లను పూర్తిగా నిలిపేద్దామన్నారు. క్లాత్ బ్యాగ్ వెండింగ్ యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పిన సీఎం.. ప్రపంచంలో ఏ వస్తువు నిరుపయోగం కాదని.. నిరుపయోగంగా ఉన్న వస్తువు నుంచి సంపద సృష్టించవచ్చని తెలిపారు. ప్రగతి పథంలో ముందుకెళ్తున్న మన రాష్ట్రానికి ఇప్పుడు నేర, హత్యా రాజకీయాలు చేసేవాళ్లు అవసరమా? అని సీఎం ప్రశ్నించారు.ఏపీలో పేరుకుపోయిన చెత్తను అక్టోబర్‌లోగా శుభ్రం చేస్తామన్న చంద్రబాబు.. ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని, ఆగస్టు నెలలోగా సచివాలయంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని చంద్రబాబు తెలిపారు. డిసెంబర్‌లోగా ప్రభుత్వ ఆఫీసుల్లోనూ ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందని చెప్పారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మించి.. %ూ×%ని అభివృద్ధి చేస్తామని, క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుందని చంద్రబాబు అన్నారు.ఒకప్పుడు ఐటీకి ప్రాధాన్యం.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యం ఉందని చంద్రబాబు అన్నారు. 'వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేశాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.' అని ఆయన చెప్పారు.రాజకీయాలు కలుషితమైపోయాయని తెలిపిన సీఎం చంద్రబాబు.. నేరచరిత్ర ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చారని, నేర రాజకీయాలు చేసేవారు మనకు అవసరమా? అంటూ ప్రశ్నించారు. ఇంట్లో చెత్తను ఊడ్చినట్టు.. నేర చరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'నా జీవితంలో ఎప్పుడూ హత్యా రాజకీయాలు లేవు. నక్సలిజం, ఫ్యాక్షన్, మతకలహాలపై పోరాడాను. నక్సలైట్లు నన్ను చంపాలని చూస్తే వేంకటేశ్వరస్వామి కాపాడారు. గత ఐదేళ్లు ప్రజలకు స్వేచ్ఛ లేదు. గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయలేదు. ప్రజల భూములను కబ్జా చేసేందుకు యత్నించారు. మేం వచ్చాక ఫ్యాక్షనిజం, మతకలహాలను నివారించాం. హత్యా రాజకీయాలు చేయాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టను. నేరస్థుల గుండెల్లో నిద్రపోతా. వైసీపీ నేతలు వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరించారు. నారాసుర రక్తచరిత్ర అని నాపై వివేకా హత్య నింద వేశారు. మామిడి రైతులకు టన్నుకు రూ.12వేలు ఇచ్చి ఆదుకుంటే, రోడ్డుపై మామిడి కాయలు పారబోసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల రాజకీయం చేశారు' అని సీఎం చంద్రబాబు విమర్శించారు.

# ప్రధాని మోదీపై ఖర్గే ఫైర్

మొదటిపేజీ తరువాయి –

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 42 దేశాలను సందర్శించిన ప్రధాని మోదీ, అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మణిపూర్ రాష్ట్రాన్ని మాత్రం ఇప్పటివరకు సందర్శించలేకపోయారని ఎద్దేవా చేశారు. మణిపూర్‌లో గత కొంతకాలంగా హింసాత్మక సంఘటనలు, గిరిజన సమస్యలు, రాజకీయ అస్థిరతలు కొనసాగుతున్నాయని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దీనిపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆయన ఆరోపించారు. దేశ ప్రధానమంత్రిగా మోదీ సొంత దేశంలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విదేశీ పర్యటనలపై దృష్టి సారించడం సరికాదని ఖర్గే వ్యాఖ్యానించారు. మణిపూర్ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవడానికి మోదీ స్వయంగా రాష్ట్రాన్ని సందర్శించి, స్థానిక నాయకులతో చర్చించాలని ఆయన సూచించారు. మణిపూర్‌లో శాంతి, స్థిరత్వం తీసుకురావడానికి తక్షణ చర్యలు అవసరమని ఖర్గే పేర్కొన్నారు. అంతేకాకుండా, రాజ్యాంగాన్ని మార్చే ఏ ప్రయత్నమైనా దేశ ప్రజల హక్కులను హరించే చర్యగా పరిగణించబడుతుందని ఖర్గే హెచ్చరించారు. భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమని, దానిని బలహీనపరిచే ఏ చర్యనైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగ విలువలను కాపాడుతూ, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడుతుందని ఆయన పునరుద్ఘాటించారు.

# నలుగురు అన్యమత ఉద్యోగులని సస్పెండ్ చేసిన టీటీడీ



మొదటిపేజీ తరువాయి –

నలుగురు అన్యమత ఉద్యోగులని తిరుమల తిరుపతి దేవస్థానం సస్పెండ్ చేసింది. ఈ మేరకు ఇవాళ టీటీడీ ప్రకటన విడుదల చేసింది. టీటీడీలో పనిచేస్తున్న బి.ఎలిజర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (క్వాలిటీ కంట్రోల్), ఎస్. రోసి, స్టాఫ్‌నర్స్(బర్డ్ ఆస్పత్రి), ఎం.ప్రేమావతి, గ్రేడ్ -1 ఫార్మసిస్ట్ (బర్డ్ ఆస్పత్రి), అదేవిధంగా డా.జి.అసుంత. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీల్లో విధులు నిర్వహిస్తున్న ఈ నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు.సదరు నలుగురు ఉద్యోగులు అన్యమతాన్ని అనుసరిస్తున్నారని.. అందుకు సంబంధించిన ఆధారాలు, వీరిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేశామని టీటీడీ అధికారులు చెప్పుకొచ్చారు. వీరు టీటీడీ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని అన్నారు. హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరించారని చెప్పారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సదరు నలుగురు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేశామని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

# తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ ప్రమాణస్వీకారం



మొదటిపేజీ తరువాయి – జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన సీజేగా ప్రమాణం చేసిన ఏకే సింగ్ కు అభినందనలు తెలియజేశారు. కాగా ఇటీవల దేశంలో ఐదుగురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేస్తూ, ఐదు హైకోర్టులకు కొత్త సీజేలను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. తెలంగాణతో పాటు త్రిపుర, మద్రాస్, రాజస్థాన్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులు బదిలీ అవ్వగా.. మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, కర్ణాటక, గువాహటి, పట్నా హైకోర్టులకు కొత్త ప్రధాన న్యాయమూర్తులు నియమితులయ్యారు.

**ఏకే సింగ్ గురించి క్లుప్తంగా...**

న్యాయకోవిదుల కుటుంబంలో మూడో తరానికి చెందిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధ సింగ్ దంపతులకు జన్మించారు. ఆయన తల్లివైపు కుటుంబానికి చెందిన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా, మరో తాత అయిన జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. సమీప బంధువులైన జస్టిస్ బిశ్వేశ్వర్ ప్రసాద్, జస్టిస్ శివకీర్తి సింగ్ సుప్రీంకోర్టు జడ్జీలుగా పనిచేశారు.ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందిన ఏకే సింగ్ 1990లో ఉమ్మడి పట్నా హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు జార?ండ్ హైకోర్టులో న్యాయవాదిగా పలు కీలక కేసులు వాదించారు. 2012లో జార?ండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2014లో శాశ్వత న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2022లో జార?ండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా సేవలు అందించి, 2023లో త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పదోన్నతి పొందారు. తాజాగా తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీపై రానున్నారు.

# ఒక్క కంకికి 1000 గింజలు

మొదటిపేజీ తరువాయి – గ్లూకోజ్ శాతం తక్కువ ఉండేవిధంగా దీన్ని రూపొందిస్తున్నారు."కంకికి వెయ్యి గింజలతో ఎకరం విస్తీర్ణం గల భూమిలో పది టన్నులు పండే వరి వంగడం 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తేవాలని సంకల్పించాం. దీనికి అనుగుణంగా పరిశోధనలు జరుగుతున్నాయి. కొత్త వంగడం వరిలో హిస్టరీ క్రియేట్ చేస్తుంది. ప్రస్తుతం చైనా దేశంలో హైబ్రిడ్ వరి ఎకరానికి 6 టన్నులు వస్తోంది. మేం రూపొందిస్తున్న వరి వంగడం దాన్ని అధిగమిస్తుంది. రైతులకు ఉత్పాదకతను, దేశానికి ఆహారభద్రతను కూడా రెట్టింపు చేస్తుంది. కొత్తరకం విత్తనోత్పత్తికీ అనుకూలం" -ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు ఇక్రిశాట్ - ఇక్రిశాట్ (అంతర్జాతీయ మెట్ట ప్రాంతాల పంటల పరిశోధన సంస్థ) రాగులపై విస్తృత పరిశోధనలు చేసి, 'ర్యాపిడ్ రాగి' అనే పేరుతో ఓ కొత్త వంగడాన్ని అభివృద్ధి చేసింది. **ప్రయోజనాలెన్నో :** మన దేశంలో జొన్న, సజ్జల తర్వాత 3 అత్యంత ముఖ్యమైనటువంటి చిరుధాన్యంగా రాగి పంట గుర్తింపు పొందింది. పొరుగు రాష్ట్రమైన ఏపీలో లక్ష ఎకరాల్లో, తెలంగాణలో 13,000 ఎకరాల్లో సాగవుతోంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్నటువంటి వంగడాలతో పంట కాలం 135 రోజులుగా ఉండటంతో ఏడాదికి రెండు పంటలు మాత్రమే సాధ్యమవుతున్నాయి.

# గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో చెలరేగిన మంటలు



మొదటిపేజీ తరువాయి –12216 గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లో మంటలు చెలరేగాయి. మొదట చక్రాల నుంచి పొగలు రావ డంతో గమనించిన పైలట్ రైలును నిలిపివేసి కంట్రో ల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన రైల్వే సిబ్బంది అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ వికాస్ బురా, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ ఆఫీసర్ స్వాతి జైన్ తమ బృందంతో ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఇంజిన్ కింది నుంచి వస్తున్న పొగలను నియంత్రించారు. కానీ కొద్దిసే పటికి ఇంజిన్ లోపలి నుంచి మంటలు రావడం ప్రారంభమయ్యింది. దీంతో వెంటనే అగ్నిమాపక దళాలకు సమాచారం ఇవ్వగా వారు సకాలంలో అక్కడికి చేరుకొని మంటలను అదుపుచేశారు. **కోచ్‌లను ఇంజిన్ నుంచి తొలగించిన అధికారులు :** దాదాపు ఒకటిన్నర గంటలపాటు శ్రమించి వాటిని అదుపుచేసినట్లు అధికారులు తెలిపారు. అయితే మంటల కేవలం ఇంజిన్?కే పరిమితమయ్యాయని, వెనుక బోగీలలో కూర్చున్న ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. ముందస్తు చర్యగా కోచ్?లను ఇంజిన్? నుంచి తొలగించామన్నారు. కాగా ఈ ప్రమాదంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, ఉదయం ఆరు గంటలకు రైలును అజ్మీర్?కు పంపిన తర్వాతే, ట్రాక్?పై ఉన్న మిగతా రైళ్లు ముందుకు కదిలాయని తెలిపారు. కాగా ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. షాట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగిందా మరేమైనా కారణం ఉందా అని పరిశీలిస్తున్నారు.

# 2026లో కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం



మొదటిపేజీ తరువాయి –

వెల్లడించారు. కాజీపేట నుంచి త్వరలో 150 లోకోమోటివ్‌లు కూడా ఎగుమతి అవుతాయని ఆయన అన్నారు. భవిష్యత్తులో కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో మెట్రో కోచ్‌లు కూడా తయారవుతాయని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ 40 ఏళ్ల పోరాటమని గుర్తు చేశారు. రైల్వే వ్యాగన్లు, కోచ్‌లు, ఇంజిన్ల తయారీ పరిశ్రమను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంజూరు చేశారని అన్నారు. రాష్ట్రంలో 40 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామని వెల్లడించారు. వరంగల్‌కు ఇప్పటికే విమానాశ్రయం రావాల్సి ఉందని, ఎయిర్ పోర్టుకు భూములు ఇవ్వాలని గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎన్నోసార్లు అడిగామని గుర్తు చేశారు. భూసేకరణ గురించి ఈ ప్రభుత్వాన్ని కూడా అడుగుతున్నామని కిషన్ రెడ్డి అన్నారు..

# జై తెలంగాణ అనని సీఎం పాలనలో మహనీయులకు అవమానాలు జరుగుతున్నాయి



మొదటిపేజీ తరువాయి – రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ గద్దెను అధికారులు కూల్చేశారు. నమాజ్ చెరువు కట్ట శివారులో విగ్రహ ఏర్పాటు పనులకు ఎలాంటి పర్మిషన్లు లేవంటూ ఇరిగేషన్ శాఖ అధికారులు గద్దెను జేసీబీతో నేలమట్టం చేశారు.ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని చెప్పారు. నమాజ్ చెరువు కట్టపై ఆయన విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడం దారుణమని అన్నారు. జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి పాలనలో తెలంగాణ మహనీయులకు ఇలాంటి అవమానాలు జరగడం మనసును కలచి వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు అనుమతిని ఇవ్వాలనిగద్దెను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
ఆదివారం 20 - 07 - 2025

# జడ్చర్ల లో రూ. 1.35 కోట్లతో శ్వాసత మౌలిక వసతులు ప్రారంభం




**జడ్చర్ల నిధులు** మళ్లించిన మాజీ ఎమ్మెల్యే" బి అనిరుద్ రెడ్డి విమర్శలు తూటా " విద్యుత్ శాఖలో మంత్రి అయిన ఒక్క సబ్ స్టేషన్ కూడా ఎందుకు ఇవ్వలేకపోయారు " పర్మిషన్ లేకుండా ఆస్పత్రి నిర్మాణం విధానాలపై తీవ్ర విమర్శ ఇదే మా పాలన తేడా - మాటలు కాదు పనులతో చూపిస్తాం " జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలంగాణ సేన న్యూస్ జులై 19 జడ్చర్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు మరింత వేగం చేరింది శనివారం నాడు జడ్చర్ల మున్సిపాలిటీ 14వ వార్డు త్రిశూల నగర్ లో శాసనసభ్యులు శ్రీ జానంపల్లి అనిరుద్ రెడ్డి గారు రూ 1.35 కోట్ల విలువైన అభివృద్ధి పనులు శంకుస్థాపన చేశారు ఈ అభివృద్ధి పనుల్లో రోడ్డు నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి వీధి దీపాలు ఏర్పాటు పారిశుద్ధ్య వసతులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్చర్ల అభివృద్ధి మా ప్రభుత్వం ప్రధాన లక్ష్యం ప్రతివాడ సమగ్రంగా అభివృద్ధి చెందాలి గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధి కుదలైంది మున్సిపాలిటీకి రావలసిన రూ.30 కోట్లు నిధులు మహబూబ్నగర్ కు మళ్లించడాన్ని మర్చిపోలేని అన్నారు అంతేకాక విద్యుత్ శాఖ మంత్రి ఉన్న సమయంలో జడ్చర్లకు ఒక్క సబ్ స్టేషన్ కూడా మంజూరు చేయలేదని మాజీ ఎమ్మెల్యే పై తీవ్రంగా స్పందించారు అలాగే ఇరిగేషన్ మున్సిపాలిటీ అనుమతులు లేకుండా ఉందా పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం అనాగరికమని నిర్ణయమని విమర్శించారు నేను ముఖ్యమంత్రి గారితో మాట్లాడి జడ్చర్లకు నిధులు తెచ్చాను నాయకత్వం అనే మాటల్లో కాదు చేతల్లో చూపించాలి అభివృద్ధి పని చేసేది మేము అని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో బాదపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి తంగేళ్ల జ్యోతి అల్వాల్ రెడ్డి. మున్సిపల్ చైర్మన్ శ్రీమతి కోనేటి పుష్పలత కౌన్సిలర్లు మార్కెట్ డైరక్టర్లు ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అర్హులు అందరూ ఓటరు జాబితాలో చేరేలా చైతన్య పరచాలి

## అదనపు రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డి తో వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ న్యూస్ ,జూలై 19. :** అర్హులైన వారి అందరిని చైతన్య పరిచి ఓటరు జాబితాలో చేర్చాలి అని, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ ల తో వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ,సోషల్ సమ్మరీ రివిజన్ 2025 సంవత్సరానికి సంబంధించిన ఫారం -6, 7,8( క్లెయిమ్స్, అబ్జెక్షన్స్ ) లో పెండింగ్ ఉన్న వాటిని త్వరతగతిన పరిశీలించి వెంటనే డిస్పోజ్ చేయాలని సూచించారు.భువనగిరి నియోజకవర్గం 94 , ఆలేరు నియోజకవర్గం 97 కు సంబంధించిన క్లెయిమ్స్ , అబ్జెక్షన్స్ ( నూతన ఓటరు నమోదు, సవరణ, తొలగింపు, బదిలీ, ఫొటో మార్పిడి, మరణించిన వారిని తొలగించుట ) తదితర సవరణలను త్వరగా పరిశీలించి డిస్పోజ్ చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని, ఈ నెల 3 నుండి 17 వ తారీఖు వరకు జరిగిన బూత్ లెవెల్ ఆఫీసర్స్ కు నేషనల్ లెవెల్ ట్రైనింగ్ లో పాల్గొనని వారికి ఈ నెల 23 న ప్రత్యేక శిక్షణ నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్ తో త్వరితగతిన పరిశీలించి వెంటనే ఎప్పటికపుడు డిస్పోజ్ చేయాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్స్, ఎలక్షన్ డి.టి.లు, ఎలక్షన్ సూపరింటెండెంట్ కృష్ణ, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు..

# అర్హులకు పెన్షన్ లు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

## హైదరాబాద్ -వరంగల్ జాతీయ రహదారిపై అనంతారం చౌరస్తాలో అండర్ పాస్

## బి ఆర్ ఎస్ అనంతారం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం కు వినతి పత్రం



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, జూలై 19. :** అర్హులైన వారికి పెన్షన్ లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, అనంతరం బిఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించారు. శనివారం మండలంలోని అనంతారం బి ఆర్ ఎస్ గ్రామ శాఖ ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెల గడుస్తున్న నేటికీ వృద్ధులకు , వితంతులు ,కల్లుగీత కార్మికుల అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు, కొత్త పెన్షన్ లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అర్హత ఉన్న స్థానికంగా పల్లెపాటి ధర్మయ్య లాంటి వారికి కొంతమందికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతారం ఎక్స్ రోడ్ నుండి నాగినేని పెల్లి వరకు రోడ్ల భవనాల శాఖ నుంచి ఉన్న సింగిల్ సింగిల్ రోడ్డు ను డబుల్ రోడ్డు గా విస్తరించాలి అని తెలిపారు. హైదరాబాద్ -వరంగల్ జాతీయ రహదారిపై అనంతారం ఎక్స్ రోడ్డు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి లేక బొమ్మలరామారం వెళ్లే వాళ్లకు ప్రమాదాల బారిన పడుతున్న దృశ్య సమస్య ను ఎంపీ దృష్టికి తీసుకుపోయి ,అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బొట్టు మల్లేశం, తాజా మాజీ సర్పంచ్ చిందం మల్లికార్జున్ ,మాజీ సర్పంచ్ హరిబాబు , మాజీ ఉపసర్పంచ్ చిగురుపల్లి సోమయ్య ,బొబ్బల మీనా రెడ్డి, పల్లెపాటి కొండలు , మధిర వినోద్ , కొంగల వెంకటేష్ ,పల్లెపాటి నరసింహా, బొట్టు శేఖర్, ఎడ్ల నాగరాజ్ ,పల్లెపాటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బోనాల పండుగ




**ముధోల్:జూలై 19:తెలంగాణ సేన న్యూస్. :** తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రసిద్ధి చెందిన బోనాల మహోత్సవాన్ని శనివారం ముధోల్ మండలంలోని శ్రీ అక్షర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు బోనాలు ఎత్తుకొని, విద్యార్థులు పోతరాజులుగా, అనేక మంది విద్యార్థినిలు సాంస్కృతిక సాంప్రదాయాలు ఉట్టిపడేలా వేషధారణలో నృత్యాలు చేసి అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల ఆవరణలో అమ్మవారి విగ్రహానికి పూలమాలవేసి నైవేద్యాన్ని సమర్పించి బోనాలు ఎత్తుకొని అమ్మవారి గుడి వద్ద బోనం సమర్పించి తిరిగి వచ్చి ఆ బోనాన్ని పాఠశాలలో విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాదంగా స్వీకరించారు. ఆషాడ మాసం పురస్కరించుకొని విద్యార్థినిలు ఉపాధ్యాయులు గోరింటాకు ఉత్సవం జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో అద్భుతమైన నృత్యాలను ప్రదర్శించి పాఠశాల ఆవరణం పండుగ వాతావరణం గా తలపించేలా చేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ జారీ కోటే సుభాష్ మాట్లాడుతూ బోనాల పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. పంచభూతాలను గ్రామ దేవతలుగా భావించుకొని బోనాన్ని నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం వెనుక దాగి ఉన్న శాస్త్రీయ విషయాల గురించి విద్యార్థులకు వివరించారు. తెలంగాణలో తరతరాలుగా వస్తున్న ఈ పండగ సంప్రదాయం రోజురోజుకు మరింత వైభవోపేతంగా మారుతుందని ప్రతి ఒక్కరు కుటుంబ సభ్యులతో కలిసి ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే తెలంగాణ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సాయికుమార్, అకాడమిక్ ఇంచార్జ్ మధు షిండే, ఉపాధ్యాయులు మహేందర్, సంతోష్, మహేందర్, అశోక్, విద్యార్థులు, పోషకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి పాఠశాల లో ఘనంగా బోనాల జాతర






**ఆదిలాబాద్ జిల్లా జులై 19 (తెలంగాణ సేన న్యూస్):** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని స్థానిక ప్రగతి పాఠశాల లో శనివారం రోజున బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్స్ సురకంటి వనమాల ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాల ఆవరణంలో రంగ వల్లులు, మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఉపాధ్యాయినీలు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో బోనం కుండలను పసుపు కుంకుమ, వేపాకులతో అలంకరించుకొని బోనాలు ఎత్తుకొని బోనాల పాటలు, నృత్యాలతో పాఠశాల ఆవరణం చూపరులకు కనువిందు చేశాయి. ప్రిన్సిపాల్ కె ప్రవీణ్ మాట్లాడుతూ... విద్యార్థులలో ఆధ్యాత్మికత పెంపొందించుటకు బోనాల పండుగ ఎంతగానో ఉపయోగపడుతుందని అని అన్నారు.మన సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థులు కొనసాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, వైస్ ప్రిన్సిపాల్ మంజుల, నిజాముద్దీన్, రాధా. కావేరి.సునీత. నందిని.రమ్య. సృజన. ఆసన.స్వాతి.కావేరి. సంజన. లక్ష్మీ.లాస్య. సవిత. పీ.ఇ.టి అల్లం సాయికిరణ్ రెడ్డి మరియు విద్యార్థులు పాల్గొన్నారు..

# ఉప ముఖ్యమంత్రి పి ఆర్ ఓ రామకృష్ణ ను పరామర్శించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, జూలై 19:** రోడ్డు ప్రమాదంతో గాయపడిన డిప్యూటీ సీఎం, పి ఆర్ ఓ రామకృష్ణను ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పరామర్శించారు. శుక్రవారం యాదగిరిగుట్ట లో స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాసనమండలి సభ్యులు, సిపిఐ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ,నెల్లికంటి సత్యం తో యాదాద్రి భువనగిరి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల కార్యదర్శిలు గాదగాని మాణిక్యం, చిగుళ్ల లింగం, మహేందర్, అన్నెమైన వెంకటేశం, బబ్బురి శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# నేతన్న కు భరోసా పథకం

## దరఖాస్తులకు తేదీలు జూలై 22 నుంచి 31 వరకు

## జియో ట్యాగింగ్ కలిగిన ప్రతి.చేనేత కార్మికుడు అర్హులు

## చేనేత జోలి శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఏ శ్రీనివాసరావు

**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, జూలై 19 :** రాష్ట్ర ప్రభుత్వం నేతన్న భరోసా మార్కెట్ డెవలప్మెంట్ పథకం" ప్రవేశపెట్టడం జరిగింది అని చేనేత, జౌలి శాఖ సహాయ సంచాలకులు ఏ శ్రీనివాసరావు వెల్లడించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో పథకం అమలుకు సంబంధించిన విధి విధానాలను విడుదల చేశారు . జియో ట్యాగింగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికుడు నేతన్న భరోసా పథకంలో అర్హత కలిగి ఉంటాడు అని వివరించారు. సంవత్సరంలో గరిష్టంగా 8 వార్పులు అనగా 56 చీరలు, కనిష్టంగా నాలుగు వార్పులు అనగా 28 చీరలు నేయ వలసి ఉంటుంది అని తెలిపారు.ఉత్పత్తులపై తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన ప్రత్యేక లోగోను వేసి మార్కెట్లో అమ్ముకోవాల్సి ఉంటుంది అన్నారు. కనీసం 50 శాతం చీరలు నేసిన చేనేత కార్మికుడికి సంవత్సరానికి రూ 18 వేలు అనుబంధ కార్మికుడికి రూ 6 వేలు నేరుగా ఖాతాలో జమ చేయడం జరుగుతుంది అని వివరించారు ఈ మొత్తాన్ని ఆరు మాసాలకి సగం చొప్పున ఇవ్వడం జరుగుతుంది అని , పథకంలో చేనేత కార్మికులు నమోదు కావాలంటే చేనేత కార్మికుడి , అనుబంధ కార్మికుల యొక్క వివరాలు పొందుపరిచి న దరఖాస్తు ఫారం ఏ తెలంగాణ చేనేత లేబుల్ కొరకు ,దరఖాస్తు ఫారం బి లను, చేనేత జౌళి శాఖ అధికారులు ఆయా గ్రామాలలో పర్యటించి తగు అవగాహన కల్పించి ,స్వీకరించడం జరుగుతుంది అని పేర్కొన్నారు.దరఖాస్తు ఫారం తో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలు జమ చేయవలసి ఉంటుంది అని, జిల్లాలోని చేనేత కార్మికులు అందరూ తమ దరఖాస్తులను మీ గ్రామాలకు వచ్చినటువంటి అధికారులకు తేదీ జూలై .22 నుంచి 31. వరకు అందజేయ వలసిందిగా సూచించారు. జిల్లాలోని చేనేత కార్మికులు గ్రహించాలని కోరారు.

# స్వర్ణ గిరిలో నయన మనోహరంగా తోమాల సేవ



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,జూలై 19 :** స్వర్ణ గిరి వెంకటేశ్వర కి తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. శ్రీనివాసుడిని అర్చక స్వాములు మేళ తాళ మృదంగ ,మంగళ వాయిద్య ధ్వనుల మధ్య ,సుగంధ భరితమైన పుష్పమాలతో అలంకార ప్రియుడిని గా దర్శనమిచ్చారు. శనివారం సందర్భంగా జల నారాయణ స్వామికి మంగళ హారతులు సమర్పించారు. ఆది మధ్యాంతరాహితుడైన స్వర్ణ గిరీష్యుడిని మాడ వీధులలో ఊరేగిస్తూ, భక్త జనులు గోవిందనామ స్మరణములతో, మేల తాళ మృదంగం మంగళ ధ్వనుల మధ్య తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరుడై న స్వామికి పట్టు పితారంబరాలు ,ధరింపజేసి సుగంధ భరిత పుష్ప మాలలతో అలంకరించి ,అర్చక స్వాములు నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేద మంత్రోచరణములతో మంగళ ధ్వనుల మధ్య ,అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించి ఆనంద పరవశులయ్యారు.

# జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హుజురాబాద్ లో ఘనంగా జరిగిన ఫైనాన్సియల్ ఎంటర్ ప్రైజ్ వర్క్ షాప్ :




**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి జూలై** 19: హుజురాబాద్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో శనివారం రోజున అమెరికన్ ఇండియా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో %జ్% స్కిల్ బ్రిడ్జ్ ప్రాజెక్ట్ లో భాగంగా ఒక రోజు ఫైనాన్సియల్ ఎంటర్ ప్రైజ్ వర్క్ షాప్ నిర్వహించడం జరిగింది. ఈ వర్క్ షాప్ ను జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారులు సెక్టోరియల్ ఆఫీసర్ %వీ% . శ్రీనివాస్ గారు , అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ %ఖ% . మహేందర్ గారు, హుజురాబాద్ మండల విద్యాధికారి %దీ%. శ్రీనివాస్ గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు %దీ% . తిరుమల గారు మరియు అమెరికన్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ లంక. మహేందర్ గారు ప్రారంభించి విద్యార్థులు రూపొందించిన వివిధ స్టాల్స్ ని సందర్శించారు. ఈ వర్క్ షాప్ లో హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల నుండి 10 ఉన్నత పాఠశాలల విద్యార్థులు స్వయంగ పాల్గొని వివిధ రకాల వ్యాపార లావాదేవీలను నిర్వహించి బ్యాంకింగ్ వ్యవస్థ , వ్యాపార రంగం, ఆర్థిక లావాదేవీలు, ఇన్సూరెన్స్, ఎటిఎం సర్వీసుల సేవలు, నగదు రహిత లావాదేవీలు తదితర అంశాలపైనా సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగింది.

# మున్సిపల్ కమీషనర్ ను కలిసిన కప్ప భాస్కర్



**సిద్దిపేట** జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పూల మొక్క ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు కప్ప భాస్కర్ అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ గా బాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై తక్షణమే చర్య తీసుకుని మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

# ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ముధోల్: జులై19:తెలంగాణ సేన న్యూస్ :** ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి తన వంతుగా పాటుపడతానని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. శనివారం బైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో బైంసా డివిజన్ కు చెందిన ఆర్ఎంపీలు అంతా వచ్చి తమపై అధికారులు దాడులు ఆపేలా చూడాలని వినతి పత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీల పట్ల వేధింపు చర్యలకు పాల్పడవద్దని అన్నారు. ఆర్ఎంపీ డాక్టర్ల సైతం ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించకుండా వైద్య సేవలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా త్వరలో జిల్లా అధికార యంత్రాంగం చే ఆర్ఎంపీలకు శిక్షణ తరగతులు ఇప్పిస్తామని, పై అధికారులతో మాట్లాడి ఇస్తానని చెప్పారు. సమావేశంలోనే డి ఎం అండ్ హెచ్ తో ఆయన ఫోన్లో మాట్లాడారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలే తప్ప, ఆర్ఎంపీలు అందర్నీ ఇబ్బంది పెట్టడం సరికాదని సూచించారు. ఆర్ఎంపీల సంఘం బైంసా డివిజన్ అధ్యక్షులు ఆశ మోల్ల మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్ఎంపీల పట్ల వివక్ష చూపుతుందని అన్నారు. సంవత్సరాల నుండి తమ వృత్తి వైద్య వృత్తి అని ఆర్ఎంపీ లపై దాడులు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఆర్ఎంపి డాక్టర్లకి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంపీ లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ తడాఖా ఏంటో చూపిస్తామన్నారు. సమావేశంలో నాయకులు, డివిజన్ కు చెందిన ఆర్ఎంపీలు పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షులు మోహన్, జిల్లా కార్యదర్శి పోశెట్టి, జిల్లా గౌరవ సలహాదారు గంగాధర్, మండల అధ్యక్షులు అర్జున్, కుబీర్ మండల అధ్యక్షులు శంకర్, తానూర్ మండల అధ్యక్షులు ప్రవీణ్, లోకేశ్వర్ అధ్యక్షులు గంగాధర్, కుంటాల అధ్యక్షుడు నవీన్, ముధోల్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీ కల్పించాలి:





తెలంగాణసేన : టీయూడబ్ల్యూజే ,ఐజేయూ అధ్యక్ష,కార్యదర్శులు కొండూరి రవీందర్ ,వెంక గారి భూమయ్య నిర్మల్:జూలై 19:తెలంగాణ సేన న్యూస్. :ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఐజేయూ నిర్మల్ జిల్లా అధ్యక్షు కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంక గారి భూమయ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)లకు వినతిపత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక మంది వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను కమిటీ హైలైట్ చేసింది. వారి పిల్లల విద్యకు మద్దతు ఇవ్వాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. జర్నలిస్టుల పిల్లలకు పూర్తి ఫీజు మినహాయింపు ఇవ్వాలని ప్రైవేట్ విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని అధికారులను కోరారు.ఈ చర్య జర్నలిస్టులపై భారాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, వారి పిల్లలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యను పొందేందుకు వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, డీఈఓ తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో రాయితీని అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మల అశోక్, జల్దా మనోజ్, సంయుక్త కార్యదర్శి సట్ల హనుమన్లు, జిల్లా సభ్యులు డిఎస్ మధు, రామచందర్, ప్రసాద్,కే. రమణ తదితరులు పాల్గొన్నారు.

# బ్లూ ఫౌండేషన్ రెయిన్ బో హోమ్ లో ఉచిత వైద్య శిబిరం




**లాలాపేట్, జూలై 19 తెలంగాణసేన :** : ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని రెయిన్ బో హోమ్స్ సిటీ మేనేజర్ వి. క్రాంతి కిరణ్ అన్నారు. లాలాపేట్ వినోబా నగర్ లోని బ్లూ ఫౌండేషన్ రెయిన్ బో హోమ్ లో జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ లు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి, ఆరోగ్య సలహాలను, మందులు కూడా అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ ఎం. శ్రీనివాస్ ఒంటినొప్పులు ఉన్నవారికి ఎక్సర్ సైజ్ లను చూపించారు. ఈ శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ సభ్యుడు వెంకట నారాయణ, కో ఆర్డినేటర్ నర్సింగ్ రావు, సరితా రెడ్డి, బ్లూ ఫౌండేషన్ డైరెక్టర్ వి. క్రాంతి కిషోర్, సిబ్బంది వసంత, డానియల్, రేణుక, ఉష, కిమ్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ జే.విక్రమ్, జర్నలిస్ట్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

# కేటీఆర్ కు బుద్ధి లేదు కాంగ్రెస్ ఫోన్ టాపింగ్ చేస్తుంది అనటం పై అర్ధ రహితం

**మండలంలో,రూ .4.5 కోట్ల అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమాలలో**

**ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,జూలై 19 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ టాపింగ్ చేస్తుంది అని, కేటీఆర్ మాట్లాడటం, బుద్ధి లేకుండా అర్ధ రహితమైన మాటలని, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హెచ్ఎండిఏ నిధులైన ఎస్ డి ఎఫ్, డి ఎం ఎఫ్ రూ.4.5 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని అనంతారం, తాజ్ పూర్ , హన్మాపూర్, మన్నెవారి పంపు ,వడపర్తి, బస్వాపురం ,ముత్తిరెడ్డిగూడెం, గంగసానిపల్లి గ్రామాలలో పర్యటించారు. సందర్భంగా మాట్లాడుతూ,ఎన్నికలలో బి ఆర్ఎస్ కు డిపాజిట్లు గల్లంతు చేసిన కేటీఆర్ కు బుద్ధి రాలేదని విమర్శించారు. భార్యాభర్తలు మాట్లాడు కుంటున్నవి వినటం కెసిఆర్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాప్ చేశారని దుర్మార్గమైన చర్య అన్నారు.సినిమా హీరోయిన్ లు రాజకీయ నాయకులు, రాజకీయ ప్రత్యర్థులవి, హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్ టాపింగ్ చేయడం బిఆర్ఎస్ పార్టీ నేతల నేర పూరితమైన సంస్కృతిని అర్థం చేసుకోవచ్చు అన్నారు .రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి సమస్య మీద స్పందిస్తుందని ,ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రంలో పేద ప్రజలకు మహిళలకు అన్ని సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ,గత పది సంవత్సరాలు కెసిఆర్ పాలనలో ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి మండలంలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా హెచ్ఎండిఏ నిధులను తీసుకువచ్చి భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధికి కృషి జరుగుతుందని వివరించారు.

# అన్ని ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి

**ఇటీవల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల మరణాలపై**

**పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలి**

**కలెక్టరేట్ పరిపాలన అధికారి కి సమర్పించిన వినతిపత్రం**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్**



**భువనగిరి ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్, జూలై 19 :** ప్రభుత్వ సంక్షేమ ఆశ్రమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ పరిపాలన అధికారి కి వినతి పత్రం సమర్పించారు.జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో గురుకుల పాఠశాల కళాశాలల లో ఆశ్రమ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించాలి కోరారు. హాస్టలలో వార్డెన్ లు అందుబాటులో ఉండాలని నిరంతరం ఉన్నతాధికారుల పర్యవేక్షణ జరగాలని ,జిల్లాలో గురుకుల పాఠశాలలలో జరుగుతున్న విద్యార్థుల మరణాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చిప్పలపల్లి బన్నీ, వంశీ తదితరులు పాల్గొన్నారు

# పీఎల్ఎఫ్‌లో వైటీపీఎస్ యూనిట్-1 టాప్



ప్రారంభానికి ముందే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1 రికార్డులు సృష్టిస్తున్నది. 2025-26లో అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పీఎల్ఎఫ్)తో టాప్‌లో (77.56శాతం)నిలిచింది. ప్రారంభానికి ముందే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-1 రికార్డులు సృష్టిస్తున్నది. 2025-26లో అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పీఎల్ఎఫ్)తో టాప్‌లో (77.56శాతం)నిలిచింది. ఆ తర్వాత 75.90శాతం పీఎల్ఎఫ్‌తో కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్-2 రెండోస్థానంలో, 71.37 శాతం పీఎల్ఎఫ్‌తో బీటీపీఎస్-4 యూనిట్ మూడోస్థానం లో నిలిచాయి. విద్యుత్తు ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పీఎల్ఎఫ్‌గా పిలుస్తారు. రాష్ట్రంలో మొత్తం 12 థర్మల్‌ప్లాంట్లు ఉండగా, ప్రస్తుతం 10 యూ నిట్లు నడుస్తున్నాయి. రెండు యూనిట్లు ఓవరాలింగ్(మరమ్మతులు)జరుగుతున్నాయి. వైటీపీఎస్‌లో మొత్తం 2 యూనిట్లుండగా.. ప్రస్తుతం 800 మెగావాట్ల యూనిట్-2 అందుబాటులోకి వచ్చింది. మరో 800 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్ -1లో ఈ నెల 12న కమిషనింగ్ ఆఫ్ డేట్(సీవోడీ)విజయవంతమైన విషయం తెలిసిందే. 72 గంటలపాటు నిరంతరాయంగా నిర్వహించిన ఈ సీవోడీలో 800 మెగావాట్లకు 814 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యింది. బాయిలర్ లైటప్, ట్ర యల్స్, సీవోడీ వరకు యూనిట్-1 అత్యధిక పీఎల్ఎఫ్‌ను నమోదుచేసింది.ఆరోపణలు చేసినోళ్లే ప్రారంభం..ట్రయల్స్, సీవోడీ విజయవంతం కావడంతో వైటీపీఎస్ యూనిట్-1ను వారం, పదిరోజుల్లో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. వైటీపీఎస్‌పై గతంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు కాంగ్రెస్ నేతలు పలు ఆరోపణలు చేశారు. ఇప్పుడు వారే ఈ ప్లాంట్లను ప్రారంభిస్తుండటం గమనార్హం.

# ఇక ఐటీఆర్-2 సిద్ధం




ఆన్‌లైన్‌లో ఆదాయ పన్ను రిటర్న్-2 (ఐటీఆర్-2) ఫారాన్ని దాఖలు చేసే సదుపాయాన్ని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ కల్పించింది. ఆన్‌లైన్‌లో దాఖలుకు వీలు కల్పించిన ఐటీ శాఖ ఆన్‌లైన్‌లో ఆదాయ పన్ను రిటర్న్-2 (ఐటీఆర్-2) ఫారాన్ని దాఖలు చేసే సదుపాయాన్ని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ కల్పించింది. పన్నుసహిత మూలధన లాభాల ఆదాయం కలిగిన వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి (2025-26 మదింపు సంవత్సరం)గాను ఐటీఆర్-2 ఫారాన్ని తమ ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో సమర్పించవచ్చని శుక్రవారం ఎక్స్‌లో ఐటీ శాఖ తెలియజేసింది. గత నెల జూన్‌లో చిన్న, మధ్యశ్రేణి ట్యాక్స్‌పేయర్స్ కోసం సరళతరమైన ఐటీఆర్-1, 4 ఫారాలను ఆన్‌లైన్‌లో దాఖలు చేసే వీలును ఐటీ శాఖ కల్పించిన విషయం తెలిసిందే. కాగా, ఐటీఆర్ దాఖలుకున్న గడువును జూలై 31 నుంచి సెప్టెంబర్ 15 వరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పొడిగించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఐటీఆర్-2 ఫారాన్ని ఐటీ శాఖ అందుబాటులోకి తేవడంతో ఐటీ రిటర్న్ ఫైలింగ్ మరింత ఊపందుకోవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి

# కల్తీని అరికట్టలేక కల్లుపై నిషేధమా?..

**మద్యం మాఫియాతో కాంగ్రెస్ సర్కార్ కుమ్మక్కు**

**కమీషన్ల కక్కుర్తితో ప్రకృతి పానీయాన్ని విషం చేస్తున్నారు**

**మా జోలికొస్తే వృత్తిదారులతో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం**

**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక**



కల్లు కల్తీ జరిగిన దుకాణాలు కాంగ్రెస్ నాయకులవే కల్తీని అరికట్టడం చేతగాకే కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మందికి జీవనాధారమైన కల్లుపై నిషేధం విధించాలని యోచిస్తున్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తంచేశారు. కల్తీని అరికట్టడం చేతగాకే కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మందికి జీవనాధారమైన కల్లుపై నిషేధం విధించాలని యోచిస్తున్నదని బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ ఆందోళన వ్యక్తంచేశారు. మద్యం మాఫియాకు తలొగ్గి కల్లును నిషేధిస్తే లక్షలాది మంది కల్లుగీత వృత్తిదారులతో హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ పేరిట కల్లు వృత్తినే నిషేధించాలని చూస్తున్నారని, ఔటర్ రింగు రోడ్డు లోపలి దుకాణాలన్నింటినీ మూసివేస్తామంటూ సర్కార్ లీకులు ఇప్పిస్తున్నదని ధ్వజమెత్తారు. గతంలోనూ వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో కల్లుపై నిషేధం విధించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక గీత వృత్తిదారులను ఆదుకున్నదని తెలిపారు.ఇటీవల కల్తీ జరిగిన కల్లు దుకాణం కాంగ్రెస్ కార్పొరేటర్‌దేనని, ముందుగా అతనిపై చర్యలు తీసుకోవాలని, కల్తీని నిరోధించడంలో విఫలమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మామూళ్ల మత్తులో కొందరు కల్తీని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఒక కల్లు కంపౌండ్‌లో 200 మందికి జీవనధారం దొరుకుతుందని, అదొక కుటీర పరిశ్రమగా కొనసాగుతున్నదని చెప్పారు. కల్లు నుంచి వైన్, వోడ్కా లాంటివి తయారు చేయవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారని, అలాంటి తరుణంలో ఈ ప్రకృతి పానీయమే లేకుండా చేయాలని పాలకులు చూస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీని వెనుక ఉన్నది మద్యం మాఫియా ఉన్నదని విమర్శించారు.

**లోపాయికారి ఒప్పందం**

డిస్టిలరీ కంపెనీ నుంచి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కల్లును పూర్తిగా బంద్ చేయిస్తే మద్యం సరఫరా పెరుగుతుందని, తద్వారా మరింత కమీషన్లు ఇస్తామని ఆయా కంపెనీలు సైతం ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. కర్నాటకలోనూ అదే జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కేవలం 11 లక్షల లీటర్లు ఇచ్చే ఆవులు, బర్రెలే ఉన్నాయని, కానీ నిత్యం 56 లక్షల లీటర్ల పాలు సరఫరా అవుతున్నాయని, కెమికల్స్, యూరియా వంటి రసాయనాలు కలిపి కల్తీ పాలను తయారు చేస్తున్నారని ఆరోపించారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం, కేవలం 2 శాతం మంది సేవించే కల్లులో కల్తీ జరిగితే పూర్తిగా ఆ వ్యవస్థపై నిషేధం పెట్టాలని చూడటం ప్రభుత్వ అవివేకతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ గెలుపునకు జాతి ఓట్లు కూడా దోహదపడ్డాయని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. హైదరాబాద్‌లో కల్లును నిషేధిస్తే తమ పదవులను వదిలి బయటకు రావాలని స్పష్టంచేశారు. సమావేశంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, తెలంగాణ గౌడ ఐక్యసాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్, బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ లీగల్ అడ్వయిజర్ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, నవ సంఘర్షణ సమితి అధ్యక్షుడు పంజాల జైహింద్‌గౌడ్, బీసీ, గౌడ నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రవణ్‌గౌడ్ పాల్గొన్నారు.

# అత్యుత్తమ బ్యాంక్ ఎస్బీఐ




ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ).. ఈ ఏడాదికిగాను ప్రపంచంలోనే అత్యుత్తమ కన్స్యూమర్ బ్యాంక్‌గా నిలిచింది. గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఈ అవార్డును ప్రకటించినట్టు ఓ ప్రకటనలో శుక్రవారం ఎస్బీఐ తెలియజేసింది.ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ).. ఈ ఏడాదికిగాను ప్రపంచంలోనే అత్యుత్తమ కన్స్యూమర్ బ్యాంక్‌గా నిలిచింది. గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఈ అవార్డును ప్రకటించినట్టు ఓ ప్రకటనలో శుక్రవారం ఎస్బీఐ తెలియజేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్యాంకర్లు, విశ్లేషకులు, కార్పొరేట్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి అభిప్రాయాలను సేకరించి.. వాటిని సమగ్రంగా పరిశోధించి, విశ్లేషించిన తర్వాతే అవార్డుల కోసం ఎంపిక జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్బీఐ వివరించింది. కాగా, అమెరికాలోని వాషింగ్టన్ డీ.సీలో జరుగబోయే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)/ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాల్లో భాగంగా ప్రపంచ అత్యుత్తమ బ్యాంక్ పేరిట ఈ ఏడాది అక్టోబర్ 18న నిర్వహించే వార్షిక కార్యక్రమంలో ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టికి గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఈ అవార్డును బహూకరించనున్నది

**కస్టమర్ల అనుభవం ప్రధానం: శెట్టి**

'మా (ఎస్బీఐ) వృద్ధికి ఖాతాదారుల అనుభవమే ప్రధాన వ్యూహం' అని ఎస్బీఐ చైర్మన్ శెట్టి ఈ సందర్భంగా అన్నారు. ఎస్బీఐకి ఈ అవార్డు రావడంపట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. ఇందుకు కారణమైన కస్టమర్లకు, అంకితభావం కలిగిన ఉద్యోగులకు, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. నిరంతర డిజిటల్ సేవలతోపాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ అంతరాయం లేని బ్యాంకింగ్ కార్యకలాపాలకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని, ఖాతాదారులకు అత్యుత్తమ బ్యాంకింగ్ సేవల అనుభూతిని అందజేస్తున్నామన్న ఆయన.. కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సర్వీసులనూ విస్తృతం చేస్తున్నట్టు వెల్లడించారు. 52 కోట్లకుపైగా కస్టమర్లకు సేవలందిస్తున్న ఎస్బీఐ నిబద్ధతకు ఈ ప్రపంచ స్థాయి గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. దేశ, విదేశాల్లో ఎక్కడ ఎస్బీఐ కార్యకలాపాలున్నా అక్కడ తమ ఖాతాదారులకు ప్రపంచ శ్రేణి బ్యాంకింగ్ సేవల్ని అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు

# పొట్టలో అసౌకర్యంగా ఉండి విరేచనాలు అవుతున్నాయా..? ఈ చిట్కాలను పాటించండి..!



వర్షాకాలంలో సహజంగానే మనకు జీర్ణ సమస్యలు అధికంగా వస్తుంటాయి. ఇందుకు అనేకే కారణాలు ఉంటాయి. ఎక్కువగా కలుషిత ఆహారం తినడం లేదా నీళ్లను తాగడం వల్ల మనకు పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. %హ్శీఝఎష్ట్ర ఖజూంవ్% ఎ వర్షాకాలంలో సహజంగానే మనకు జీర్ణ సమస్యలు అధికంగా వస్తుంటాయి. ఇందుకు అనేకే కారణాలు ఉంటాయి. ఎక్కువగా కలుషిత ఆహారం తినడం లేదా నీళ్లను తాగడం వల్ల మనకు పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. కొందరికి విరేచనాలు ఎడతెరిపి లేకుండా అవుతూనే ఉంటాయి. అయితే ఇందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన వంట ఇంట్లో ఉండే పదార్థాలతోనే అత్యంత సహజసిద్ధంగా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఈ పదార్థాలను ఉపయోగిస్తే పొట్టలో ఏర్పడే అసౌకర్యం తొలగిపోవడమే కాదు విరేచనాలు కూడా ఆగిపోతాయి. అలాగే ఇతర జీర్ణ సమస్యల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.

**అల్లం..**

అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణాశయ గోడలను ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి. దీంతో పొట్టలో ఏర్పడే అసౌకర్యం తగ్గిపోతుంది. అలాగే వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. అల్లాన్ని తీసుకుంటే జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. దీంతో జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. చిన్న అల్లం ముక్కను 2 కప్పుల నీటిలో వేసి ఒక కప్పు నీరు అయ్యే వరకు మరిగించాలి. అనంతరం ఆ నీళ్లను వడకట్టి గోరు వెచ్చగా ఉండగానే అందులో కాస్త తేనె కలిపి తాగేయాలి. ఇలా రోజుకు 2 సార్లు తాగితే మంచి ఫలితం ఉంటుంది. అలాగే చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకుని నేరుగా అలాగే నమిలి తినవచ్చు. భోజనానికి ముందు 1 టీస్పూన్ అల్లం రసం సేవిస్తున్నా కూడా ఫలితం ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం అద్భుతంగా పనిచేస్తుంది.

**పుదీనా ఆకులు..**

పుదీనా ఆకుల్లో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణాశయ గోడలను ప్రశాంతంగా ఉండేలా చేస్తాయి. దీంతో పొట్టలో ఏర్పడే నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. గ్యాస్ బయటకు వెళ్లిపోతుంది. వికారం తగ్గుతుంది. కొన్ని పుదీనా ఆకులను నోట్లో వేసుకుని నమిలి మింగవచ్చు. లేదా పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. ఇలా రోజుకు 2 నుంచి 3 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. అన్ని రకాల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అలాగే జీలకర్ర కూడా ఈ సమస్యలకు అద్భుతంగానే పనిచేస్తుంది. ఇందులో కార్మినేటివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల జీలకర్రను తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ తగ్గిపోతాయి. జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. జీలకర్రను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను ఒక కప్పు మోతాదులో రోజుకు 2 సార్లు తాగుతుండాలి. లేదా ఒక గ్లాస్ మజ్జిగలో కొద్దిగా జీలకర్ర పొడి వేసి కలిపి తాగుతున్నా కూడా ప్రయోజనం ఉంటుంది.

**బేకింగ్ సోడా, నిమ్మరసం..**

బేకింగ్ సోడా సహజసిద్ధమైన అంటాసిడ్ మాదిరిగా పనిచేస్తుంది. ఇది జీర్ణాశయంలో అధికంగా ఉత్పత్తి అయ్యే యాసిడ్ల ప్రభావాన్ని తగ్గిస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, గుండెల్లో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. పొట్టలో ఏర్పడే అసౌకర్యం తొలగిపోతుంది. అలాగే నిమ్మరసం యాసిడ్ స్వభావాన్ని కలిగి ఉన్నప్పటికీ ఇది పొట్టలోకి చేరితే భిన్నంగా పనిచేస్తుంది. అందువల్ల ఈ రెండింటి మిశ్రమం పొట్టలో ఏర్పడే అసౌకర్యాన్ని తొలగిస్తుంది. ఒక గ్లాస్ నీటిలో అర టీస్పూన్ బేకింగ్ సోడా, సగం నిమ్మ చెక్క రసాన్ని పిండి బాగా కలిపి ఈ మిశ్రమాన్ని రోజుకు ఒకసారి సేవించాలి. ఇలా చేస్తుంటే పొట్టలో ఏర్పడే అసౌకర్యం నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా అజీర్తి తగ్గిపోతుంది. దీని వల్ల విరేచనాల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఇలా పలు సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే వర్షాకాలంలో వచ్చే జీర్ణ సమస్యలకు చెక్ పెట్టవచ్చు

# ఆ అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లకు నెయ్యి విషంతో సమానమట..!



కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు మాత్రం నెయ్యిని ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఆ అనారోగ్య సమస్యలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. భారతీయ వంటకాల్లో చాలావరకు నెయితో చేసేవే ఉంటాయి. స్వీట్స్ నుంచి టిఫిన్స్ వరకు ప్రతీది నెయ్యితో తినేవాళ్లు ఎక్కువగా ఉంటారు. నెయ్యితో ఆహారానికి అదనపు రుచి వస్తుంది. పప్పు, పచ్చడి, చపాతీ ఇలా ఏదైనా సరే నెయ్యి లేకుండా తినేందుకు చాలామంది ఇష్టపడరు. వాస్తవానికి రోజూ నెయ్యి తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. కానీ కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవాళ్లు మాత్రం నెయ్యిని ఎట్టి పరిస్థితుల్లో తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఆ అనారోగ్య సమస్యలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..వాస్తవానికి నెయ్యిలో ఎన్నో పోషకాలుంటాయి. నెయ్యి మనల్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు అందాన్ని కూడా పెంచుతుంది. అయితే గుండె, మూత్రపిండాల సమస్యలు ఉన్నవాళ్లు నెయ్యిని ఎక్కువగా వాడొద్దని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే నెయ్యిలో ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయని అంటున్నారు.అదేవిధంగా జీర్ణ సమస్యలతో బాధపడేవారు కూడా నెయ్యిని తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గ్యాస్, అజీర్ణం లాంటి సమస్యలతో బాధపడుతున్నవారు నెయ్యిని ఎక్కువగా తినకూడదని అంటున్నారు. జీర్ణ సంబంధ సమస్యలు ఉన్నవాళ్లు నెయ్యిని ఎక్కువగా తింటే ఆ సమస్యలు మరింత ఎక్కువ అవుతాయని హెచ్చరిస్తున్నారు.రక్తపోటు (బీపీ) సమస్యలు ఉన్నవాళ్లు కూడా నెయ్యిని దూరం పెట్టాలని నిపుణలు సలహా ఇస్తున్నారు. నెయ్యిలోని కొవ్వు ఆమ్లాలు రక్తపోటును పెంచుతాయని చెబుతున్నారు. దగ్గు, జలుబు, జ్వరం లాంటి సమస్యలు ఉన్నప్పుడు నెయ్యిని తినకపోవడమే మంచిదని అంటున్నారు.ఇక అధిక బరువు ఉన్నవాళ్లు, బరువు తగ్గించుకునే ప్రయత్నంలో ఉన్నవాళ్లు కూడా నెయ్యికి దూరంగా ఉండాలని చెబుతున్నారు. నెయ్యి ఎక్కువగా తింటే మరింత బరువు పెరిగిపోతారని నిపుణులు అంటున్నారు. నెయ్యిలో కాలరీలు కూడా ఎక్కువగా ఉంటాయని, అందువల్ల బరువు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.మధుమేహం సమస్య ఉన్నవాళ్లు కూడా నెయ్యికి దూరంగా ఉంటేనే మంచిదని నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో ఉండే కొవ్వుల వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి షుగర్ పేషెంట్స్ నెయ్యికి దూరంగా ఉండాలని అంటున్నారు

# వర్షాకాలంలో కాళ్ళకు ఫంగల్ ఇన్ఫెక్షన్.. ఈ టిప్స్?తో సమస్య దూరం..







వర్షాకాలంలో మీరు నడుస్తున్న సమయంలో ఒక్కోసారి బురద వంటి ప్రదేశాల్లో కాళ్ళు పెట్టాల్సి వస్తుంది. దీని కారణంగా ఫంగల్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుంది. మీ కాళ్ళను జాగ్రత్తగా చూసుకోవడానికి, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నివారించడానికి వాటిని శుభ్రంగా, పొడిగా ఉంచడం చాల ముఖ్యం. వర్షం వేళా కాళ్ళని ఫంగల్ ఇన్ఫెక్షన్ నుంచి కాపాడటానికి ఉపయోగపడే చిట్కాలు గురించి ఈరోజు తెలుసుకుందామా మరి..

**కాళ్ళను శుభ్రపరచడం:** ప్రత్యేకించి వర్షంలో తడిసిన తర్వాత ప్రతిరోజూ తేలికపాటి సబ్బు, గోరువెచ్చని నీటితో మీ కాళ్ళను కడగాలి. ఇలా చేయడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా ఇతర సమస్యలు రాకుండా మీ కాళ్ళను కాపాడవచ్చు.

**కాళ్ళను ఆరబెట్టడం:** మీ కాళ్ళు, పాదాలను, ముఖ్యంగా కాలి వేళ్ల మధ్య, మృదువైన టవల్ ఉపయోగించి పూర్తిగా ఆరబెట్టండి. ఇలా చేస్తే కళ్ళలో నీరు నిలిచిపోకుండా ఉంటుంది. దీంతో ఫంగల్ ఇన్ఫెక్షన్ ముందుగానే అరికట్టవచ్చు.

**మాయిశ్చరైజింగ్:** మీ చర్మాన్ని హైడ్రేట్?గా ఉంచడానికి తేలికైన, జిడ్డు లేని మాయిశ్చరైజర్ రాయండి. ముఖ్యంగా మీకు చెమట పట్టే పాదాలు ఉంటే, అదనపు తేమను పీల్చుకోవడానికి యాంటీ ఫంగల్ పౌడర్ వాడండి.

**గోళ్ల సంరక్షణ:** మీ కాలి గోళ్ల కింద మురికి, చెత్త పేరుకుపోకుండా ఉండటానికి వాటిని క్రమం తప్పకుండా కత్తిరించండి. ఇలా చెయ్యకపోతే గోళ్లలో మురికి పేరుకుపోయి కాళ్ళలో ఫంగల్ ఇన్ఫెక్షన్ సమస్యలు కారణం అవుతుంది.

**చెప్పులు లేకుండా నడవకండి:** తడి ప్రాంతాలలో చెప్పులు లేకుండా నడవకండి, ఎందుకంటే ఇది మీ పాదాలకు శిలీంధ్రాలు, బ్యాక్టీరియా పేరుకుపోతుంది. ఏవైనా కోతలు లేదా గీతలు ఉంటే వెంటనే యాంటీసెప్టిక్, బ్యాండేజ్?తో సరిచేయండి.

# రోజు రాత్రి నిద్రకు ముందు రెండు వెల్లుల్లి రెబ్బలు తిన్నారంటే..



వర్షా కాలంలో ఆరోగ్య సమస్యలను నివారించడానికి మనం ముందుగానే సిద్ధంగా ఉండాలి. లేదంటే ఆస్పత్రుల చుట్టూ తిరగవల్సి ఉంటుంది. ఇలాంటి సమయాల్లో మాత్రలను ఆశ్రయించే బదులు, ఇంట్లో లభించే పదార్థాలను ఉపయోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అటువంటి ఆహారాల జాబితాలో వెల్లుల్లి.. వర్షాకాలంలో వివిధ రకాల సీజనల్ వ్యాధులు దాడి చేస్తాయి. ఇలాంటి ఆరోగ్య సమస్యలను నివారించడానికి మనం ముందుగానే సిద్ధంగా ఉండాలి. లేదంటే ఆస్పత్రుల చుట్టూ తిరగవల్సి ఉంటుంది. ఇలాంటి సమయాల్లో మాత్రలను ఆశ్రయించే బదులు, ఇంట్లో లభించే పదార్థాలను ఉపయోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. అటువంటి ఆహారాల జాబితాలో వెల్లుల్లి అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సీజన్‌లో దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం శరీరానికి చాలా మంచిది. దీనిలోని ఔషధ గుణాలు అనేక రకాల వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. అంతే కాదు ప్రతి రాత్రి రెండు వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల చెప్పలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. అలాగే వ్యాధులు దగ్గరకు రావు. కాబట్టి వెల్లుల్లి తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం..

## వెల్లుల్లి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు

వెల్లుల్లిలో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో విటమిన్లు %దీ6, జ%, మాంగనీస్, సెలీనియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ప్రతి రాత్రి రెండు వెల్లుల్లి రెబ్బలు పచ్చిగా తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది వివిధ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడానికి సహాయపడుతుంది. రోజూ వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల చర్మ సంబంధిత సమస్యలు, జుట్టు రాలడం సమస్య నుంచి బయటపడవచ్చు. వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది రక్త ప్రసరణను కూడా మెరుగుపరుస్తుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారు ప్రతిరోజూ ఉదయం రెండు వెల్లుల్లి రెబ్బలను నమలడం మంచిది. ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. వెల్లుల్లి తినడం వల్ల జీర్ణవ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తి మెరుగుపడుతుంది. ఇది జీర్ణక్రియను పెంచుతుంది. గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను నివారిస్తుంది.బరువు తగ్గాలనుకునే వారు ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో రెండు వెల్లుల్లి రెబ్బలు తినాలి. ఇది జీవక్రియను పెంచుతుంది. ఎక్కువ కేలరీలను బర్న్ చేయడానికి సహాయపడుతుంది. తద్వారా, ఇది బరువును అదుపులో ఉంచుతుంది. ఇందులో ఉండే సెలీనియం మంచి నిద్రకు సహాయపడుతుంది. వెల్లుల్లి రెబ్బలు కొలెస్ట్రాల్‌ను కరిగించి గుండెకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. గుండె సంబంధిత సమస్యలను నివారిస్తుంది. వెల్లుల్లి రెబ్బలు తినడం వల్ల కాలేయం శరీరం నుంచి విషాన్ని బయటకు పంపుతుంది. ఇది కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. వెల్లుల్లిలోని పోషకాలు నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తాయి. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# డయాబెటీస్ వచ్చే ముందు శరీరం ఇచ్చే ప్రారంభ సంకేతాలివే!







ఈ రోజుల్లో చాలా మంది డయాబెటీస్ బారిన పడుతున్నారు. తీసుకుంటున్న ఆహారం, జీవన శైలి కారణంగా, అనారోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ఇక రక్తంలో ( గ్లూకోజ్) చక్కర స్థాయి ఎక్కువ స్థాయిలో ఉన్నప్పుడు డయాబెటీస్ వస్తుంది. ఇది శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందువలన డయాబెటీస్ ప్రాథమిక స్థాయిలో ఉన్నప్పుడే తగు జాగ్రత్తలు తీసుకుంటే దీని వలన ఎలాంటి సమస్య ఉండదంట. ఇక డయాబెటీస్ వచ్చే ముందు శరీరం కొన్ని సంకేతాలను ఇస్తుందంట. అవి ఏవో ఇప్పుడు తెలుసుకుందాం

గతంలోకంటే, ప్రస్తుతం ఎక్కువగా ఆకలి, ఎప్పుడూ ఏదో ఒకటి తినాలనిపించే కోరిక డయాబెటిన్‌కు సంకేతం కావచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఇన్సులిన్ ఉత్పత్తి తక్కువగా ఉండటం వల్ల శరీరం గ్లూకోజ్‌ను సరిగ్గా తీసుకోలేకపోతంది. దీని వలన కణాలకు తగిన శక్తి లభించక నిరంతరం ఆకలి అవుతుందంట. డయాబెటీస్ వచ్చే ముందు కనిపించే ప్రాథమిక సంకేతం ఇది.

డయాబెటిన్ వచ్చే ప్రారంభంలో విపరీతమైన అలసట, నీరసం ఉంటుందంట. ఎందుకంటే శరీరం గ్లూకోజ్‌ను సమర్థవంతంగా తీసుకోకపోవడం వలన శరీరంలో శక్తి నశిస్తుంది. దీని వలన చాలా వరకు అలసట, నీరసం, ఏ పని చేయలేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయంట. అయితే మీకు ఉన్నట్లుండి, ఒక్కసారిగా తీవ్ర అలసటకు గురి అవుతే ఇది డయాబెటిన్ ప్రారంభ లక్షణమేనంట.

డయాబెటిన్ ఉన్న వారిలో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువలన వీరు చాలా త్వరగా ఇన్ఫెక్షన్స్ బారిన పడుతుంటారు. మరీ ముఖ్యంగా, జ్వరం, తరచుగా జలుబు, శ్వాసకోశ సమస్యలు లేదా మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు వంటి వస్తుంటాయి. ఇలాంటి సమస్యలు పదే పదే ఎదురవుతుంటే కూడా ఇది డయాబెటిన్ ప్రారంభ లక్షణమేనంట.

గాయం అయిన త్వరగా మానకపోవం, చిన్న గాయం అయినా సరే అది మానడానికి చాలా సమయం పట్టడం కూడా డయాబెటిన్ ప్రారంభ హెచ్చరిక నంట. ఎందుకంటే మధుమేహం ఉన్న వారిలో రోగనిరోధక శక్తి చాలా తక్కువగా ఉంటుంది. అందువలన అది శరీరంలోని ఏ ప్రక్రియనైనాన రే త్వరగా పూర్తి చేయలేదంట. దీనికారణంగా గాయులు త్వరగా మానిపోవంట.

రక్తంలో అధిక మొత్తంలో చక్కర స్థాయిలు ఉన్నప్పుడు మూత్ర విసర్జనలో మార్పులు చోటు చేసుకుంటాయి. డయాబెటీస్ ఉన్న వారిలో మూత్ర విసర్జన అనేది పెరుగుతుందంట. ముఖ్యంగా రాత్రి సమయంలో ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేయాల్సి వస్తే వారు అలర్ట్ అవ్వాల్సిందే, ఇది డయాబెటిన్ ప్రారంభ సంకేతం అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

# ఫునం.. వీవీ వనం



ఔషధ గుణాల అవిసె అవిసె చెట్టును ఇట్టే గుర్తుపట్టవచ్చు. ఇది మధ్యస్తంగా పెరిగే మొక్క. దీని పూలు తెలుపు, ఎరుపు రంగుల్లో ఎగిరే పిట్ట ఆకారాన్ని పోలి ఉంటాయి. కాయలు మునగకాయల్లా పొడుగ్గా ఉంటాయి. ఆకుల అమరిక, పూలు, కాయలు చూడగానే అవిసె చెట్టుని గుర్తించవచ్చు. అవిసె గింజలు నల్లగా, నువ్వుల ఆకారంలో, గట్టిగా ఉంటాయి. వీటిని ఆంగ్లంలో 'ఫ్లాక్స్ సీడ్స్' అంటారు. అవిసె గింజల పొడిని కూరల్లో వాడతారు. ఈ పొడికి ఎటువంటి రుచీ లేకపోయినా%ౌ% అనేక ఔషధ గుణాలు ఉండటం వల్ల వంటకాల్లో వాడతారు. అవిసె ఆకులను దంచి, రసం తీసి ఔషధంగా ఉపయోగిస్తారు. కడుపులో నులిపురుగుల బాధ నివారణకు ఇది దివ్యౌషధం. సైనసైటిస్ వల్ల కలిగే నొప్పిని ఈ ఆకు రసం తగ్గిస్తుంది. అవిసె పూల కషాయంతో రేచీకటిని నివారించవచ్చు. పశువుల మేతకు ఈ అవిసె చెట్టు ఆకులను వేయడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. పల్లెల్లో ఎక్కడ చూసినా ఈ అవిసె చెట్లు విరివిగా కనిపిస్తాయి. ఈ మధ్య పట్టణాల్లో కూడా ఎక్కువగా కనిపిస్తున్నాయి. అవిసె గింజల్లో పీచు పదార్థాలు అధిక మొత్తంలో ఉంటాయి. వీటిని కొలెస్ట్రాల్ తగ్గించే గింజలని కూడా పిలుస్తారు. వీటిలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉంటాయి. దీంతో మన ఆరోగ్యానికి హామీ లభిస్తుంది. అవిసె గింజలు శరీరంలోని గ్లూకోజ్‌ని అదుపులో ఉంచుతాయి. కేశ సౌందర్యాన్ని పెంపొందిస్తాయి. అవిసె గింజలను మానవులు వేల సంవత్సరాల నుంచి ఉపయోగిస్తున్నారని చరిత్ర ఆధారంగా తెలుస్తున్నది. జీవక్రియలను సరి చేయడంతోపాటు గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధులను నిరోధించే శక్తి అవిసె గింజలకు ఉంది. రోజూ ఒక చెంచా అవిసె గింజలు బాగా నమిలి తినడం వల్ల అనేక రుగ్మతలకు చెక్ పెట్టవచ్చు. ఈ అవిసె గింజలను మొదటిసారి 'అమెరికా మార్కెట్'లో చూశాను. దానిమీద లేబుల్ చదివాను. హైదరాబాద్ రాగానే ఈ చెట్టుని చూసి నివ్వెరపోయాను. దీనిని అనేకసార్లు చూశాను. అన్నిచోట్లా అత్యంత సులభంగా పెరుగుతుంది. అందుకే ఔషధ మొక్కను గుర్తించడం గొప్ప కళ. మా వీవీ ఔషధ వనంలో పది అవిసె చెట్లు ఉన్నాయి. వాణిజ్యపరంగానూ ఈ చెట్లను పెంచవచ్చు.

# రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో వీటిని తినండి.. మీకు ఎప్పటికీ అసలు హార్ట్ ఎటాక్ రాదు..!



ప్రస్తుత తరుణంలో చాలా మంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే ఆరోగ్యకరమైన ఆహారాలను తింటున్నారు. వ్యాయామం కూడా చేస్తున్నారు. అయితే గుండె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం లేదు. దీంతో ఎన్ని వ్యాయామాలు చేసినా, పౌష్టికాహారం తీసుకున్నా కొందరు సడెన్ గా హార్ట్ ఎటాక్ బారిన పడుతున్నారు. ప్రాణాలను కోల్పోతున్నారు. కనుక గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ అందుకు తగిన ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలోనే గుండె ఆరోగ్యాన్ని రక్షించే ఆహారాలు మనకు అనేకం అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో ఓట్స్ చాలా ప్రధానమైనవని పోషకాహార నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. ఓట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చని, ముఖ్యంగా గుండె పోటు రాకుండా అడ్డుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

## పోషకాలు అధికం..

ఓట్స్‌ను రోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో తీసుకోవాల్సి ఉంటుంది. వీటిని ఉప్మాలా తయారు చేసి తినవచ్చు. లేదా పాలు కలిపి తినవచ్చు. ఓట్స్ ఎంతో రుచిగా ఉంటాయి. ఓట్స్‌తోపాటు పండ్లను కూడా కలిపి తినవచ్చు. 100 గ్రాముల ఓట్స్‌ను తింటే సుమారుగా 390 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 68 గ్రాములు, ఫైబర్ 11 గ్రాములు, ప్రోటీన్లు 17 గ్రాములు, కొవ్వులు 7 గ్రాములు లభిస్తాయి. ఓట్స్‌లో అనేక రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా విటమిన్లు బి1, బి3, బి5, బి6, బి9లతోపాటు విటమిన్ ఇ కూడా అధిక మొత్తంలో ఉంటుంది. కనుక ఓట్స్‌ను తింటే పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. శరీరానికి పోషణ లభిస్తుంది. ఓట్స్‌లో మాంగనీస్, ఫాస్ఫరస్, మెగ్నిషియం, కాపర్, ఐరన్, జింక్, సెలీనియం అధికంగా ఉంటాయి. ఇవన్నీ మనకు రోగాలు రాకుండా చూస్తాయి. శరీర మెటబాలిజం ప్రక్రియను మెరుగు పరుస్తాయి. జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేలా సహాయం చేస్తాయి.

## హార్ట్ ఎటాక్ రాకుండా..

ఓట్స్‌ను తినడం వల్ల వాటిల్లో ఉండే బీటా గ్లూకాన్ అనే సాల్యుబుల్ ఫైబర్ మన శరీరంలో ఉండే కొలెస్ట్రాల్‌కు అతుక్కుని దాన్ని బయటకు పంపిస్తుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఫలితంగా రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఓట్స్ ఎంతగానో సహాయం చేస్తాయి. ఓట్స్‌ను తినడం వల్ల క్యాలరీలు అధికంగా లభిస్తాయి. కానీ వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. కారణం వీటిల్లో ఉండే ఫైబర్ అని చెప్పవచ్చు. ఓట్స్‌ను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా వీటిల్లో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. అందువల్ల ఓట్స్‌ను తింటే షుగర్ లెవల్స్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది.

## జీర్ణ వ్యవస్థకు..

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి కూడా ఓట్స్ మేలు చేస్తాయి. ఇవి ప్రీబయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్దకం తగ్గుతుంది. ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్ ఉన్నవారు ఓట్స్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఓట్స్‌ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల వాటిల్లో ఉండే ఫైబర్ కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధిక బరువును తగ్గించుకోవాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు ఓట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. ఓట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. వాపులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో ప్రయోజనం కలుగుతుంది. ఇలా ఓట్స్ ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడిగా రవికుమార్



తెలంగాణ వాణిజ్య, పారిశ్రామిక సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను నూతన అధ్యక్షుడిగా ప్రముఖ టెక్నోక్రాట్ రాచకొండ రవికుమార్, ఉపాధ్యక్షుడిగా కేకే మహేశ్వరి ఎన్నికైనట్టు ఎఫ్‌టీసీసీఐ తెలిపింది. రవికుమార్ ప్రస్తుతం జెటాటెక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా, కేకే మహేశ్వరి సీఐఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్ సీఎండీగా సేవలందిస్తున్నారని పేర్కొన్నది.

## బాలెనో, ఎర్టిగా వాహనాలు ప్రియం




మారుతి సుజుకీ..ఎర్టిగా, బాలెనో వాహన ధరలను 1.4 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ రెండు మాడళ్లలో భద్రత ప్రమాణాలను మెరుగుపర్చడంలో భాగంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది. దీంతో వీటి ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో రూ.6.7 లక్షల నుంచి రూ.9.92 లక్షల లోపు, ఎర్టిగా రూ.8.97 లక్షల నుంచి రూ.13.25 లక్షల లోపు లభించనున్నాయి.

## నిధుల సేకరణలో ఎస్బీఐ




దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ)..ఈక్విటీ, డెబిట్ మార్కెట్ల నుంచి రూ.45 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో క్యూఐపీ ద్వారా రూ.25 వేల కోట్ల నిధులు కూడా ఉన్నాయి. బుధవారం బ్యాంక్ క్యూఐపీల విక్రయాన్ని ప్రారంభించింది. దీంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా బాండ్లను విక్రయించడంతో మరో రూ.20 వేల కోట్లను సమీకరించాలని యోచిస్తున్నది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రూ.15 వేల కోట్లను క్యూఐపీ ద్వారా సేకరించిన విషయం తెలిసిందే.

### చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం..

## సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు




ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. ఎర్రర్ మెసేజ్‌లు వస్తున్నాయి. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. భారత్ సహా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లు ఈ సమస్యలు ఎదుర్కొన్నారు. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు పొందలేకపోతున్నారు. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాదు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. తాజా సమస్యపై ‘ఓపెన్‌ఏఐ సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది.

## హెచ్‌ఐవీకి అరబిందో ఔషధం




అరబిందో ఫార్మా.. హెచ్‌ఐవీని నియంత్రించే ఔషధాన్ని విడుదల చేయబోతున్నది. ఇందుకు సంబంధించి మెడిసిన్స్ పెటెంట్ పూల్, వివ్ హెల్త్‌కేర్‌లతో వాలంటరీ లైసెన్సింగ్ అగ్రిమెంట్‌ను కుదుర్చుకున్నది. ఔషధాన్ని తయారు చేయడంతోపాటు 133 దేశాలకు ఎగుమతి చేయాలనుకుంటున్నది. ప్రస్తుతం హెచ్‌ఐవీ చికిత్స కోసం వినియోగిస్తున్న క్యాబోటెగ్రావీర్‌కు జనరిక్ వెర్షన్‌గా ఈ ఔషధాన్ని రూపొందిస్తున్నది.

## తల్లిదండ్రులకు బిగ్ అప్డేట్.. వెంటనే ఇలా చేయకపోతే మీ పిల్లల ఆధార్ రద్దవుతుంది..

చిన్నారుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్‌కు సంబంధించి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కీలక అలర్ట్ జారీ చేసింది. చిన్నారికి ఏడేళ్లు వచ్చినా బయోమెట్రిక్ వివరాలు అప్డేట్ చేయకపోయి ఉంటే.. ఆ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని తల్లిదండ్రులకు, సంరక్షకులకు సూచించింది. ఈ మేరకు కీలక ప్రకటన విడుదల చేసింది. 5 నుండి 7 సంవత్సరాల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్‌లను వీలైనంత త్వరగా అప్‌డేట్ చేయాలని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ రిమైండర్ లో పేర్కొంది. ఆధార్ నమోదు కేంద్రాలలో 7 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బయోమెట్రిక్ నవీకరణలు ఉచితం అని పేర్కొంది. అయితే, 7 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలకు అప్డేషన్ ప్రక్రియ ఆలస్యం అయితే.. ఆధార్ నంబర్‌ను రద్దు చేయవచ్చు లేదా.. ఆలస్యమైన అప్డేషన్లకు రూ.100 రుసుము వర్తిస్తుంది.

### ఈ అప్డేషన్ ఎందుకు ముఖ్యమైనది?

“నవీకరించబడిన బయోమెట్రిక్‌తో కూడిన ఆధార్ జీవన సౌలభ్యాన్ని సులభతరం చేస్తుంది.. పాఠశాల అడ్మిషన్లు, ప్రవేశ పరీక్షలకు నమోదు చేసుకోవడం, స్కాలర్‌షిప్‌ల ప్రయోజనాలను పొందడం, (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పథకాలు లాంటి మొదలైన సేవలను పొందేందుకు ఆధార్ అప్డేట్ గా ఉండటం ముఖ్యం.. ఏడేళ్లు దాటిన బయోమెట్రిక్ వివరాలు అప్డేట్ చేయకపోతే.. ఆధారం నంబర్ డీయాక్టివేట్ అవుతుంది..” అని నొక్కి చెప్పింది. తల్లిదండ్రులు/సంరక్షకులు తమ పిల్లలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించింది.

### ఇది ముందుగా ఎందుకు చేయలేము?..

“ఐదేళ్ల లోపు పిల్లల ఆధార్ నమోదు కోసం వేలిముద్రలు.. ఐరిస్ బయోమెట్రిక్స్ సేకరించబడవు.. ఎందుకంటే అవి ఆ వయస్సులో పరిపక్వత చెందవు” అని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, పిల్లల ఆధార్‌తో అనుసంధానించబడిన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌లకు హెచ్చరికలను




పంపడం ప్రారంభించింది.. తల్లిదండ్రులను తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తి చేయాలని కోరింది.

పిల్లల ఆధార్ బయోమెట్రిక్‌ల అప్డేషన్ కోసం ఇలా చేయండి..

సమీపంలోని ఆధార్ సేవా కేంద్రాన్ని లేదా అధీకృత కేంద్రాన్ని సందర్శించండి.

అవసరమైన పత్రాలను సిద్ధం చేయండి

పిల్లల ఆధార్ కార్డును తీసుకెళ్లండి.

జనన ధృవీకరణ పత్రం లేదా పాఠశాల వంటి సహాయక పత్రాలు అవసరం కావచ్చు.

నవీకరణ ఫారమ్ నింపండి..

అవసరమైన వివరాలను అందించి, కొత్త వేలిముద్రలు, ఐరిస్ స్కాన్.. ఛాయాచిత్రాన్ని సమర్పించండి.

ప్రక్రియ పూర్తైన అనంతరం రసీదు పొందండి

సమర్పించిన తర్వాత, మీరు అప్‌డేట్ రిక్వెస్ట్ నంబర్ తో కూడిన రసీదు స్లిప్‌ను అందుకుంటారు.

ట్రాక్ అప్‌డేట్ స్థితి.. దీని ద్వారా ఆధార్ అప్డేషన్ ను తనిఖీ చేయొచ్చు..

వెబ్‌సైట్‌లోని ని ఉపయోగించి ఆన్‌లైన్‌లో నవీకరణ స్థితిని తనిఖీ చేయవచ్చు..

15 ఏళ్ల వయసులో రెండవ అప్‌డేట్ కూడా అవసరమే..

పిల్లలకి 15 ఏళ్లు నిండినప్పుడు మరొక బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరి అని తల్లిదండ్రులకు గుర్తు చేసింది.. ఎందుకంటే కౌమారదశలో శారీరక లక్షణాలు మారుతాయి. చివరి నిమిషంలో వచ్చే ఇబ్బందులను నివారించడానికి.. ఆధార్-లింక్డ్ సేవలకు అంతరాయం లేకుండా యాక్సెస్ ఉండేలా చూసుకోవడానికి తల్లిదండ్రులు వీలైనంత త్వరగా ప్రక్రియను పూర్తి చేయ ప్రకటనలో తెలిపింది.

## పన్నులు పిండేస్తున్నారు.. గత 11 ఏండ్లలో 274 శాతం పెరుగుదల




దేశంలో ఏటా ప్రత్యక్ష పన్ను వసూళ్లు పైపైకి.. వార్షిక వసూళు రూ.7 లక్షల కోట్ల నుంచి 27 లక్షల కోట్ల వరకు ఎగిసిన వైనం కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు పన్నులతో ప్రజల్ని పీల్చిపిప్పి చేస్తున్నది. 11 ఏండ్ల క్రితం గద్దెనెక్కిన ఈ ప్రభుత్వ పెద్దలు.. పన్ను పోటును మరింత పదునెక్కించారు మరి. ఈ దశాబ్దానికిపైగా కాలంలో దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏకంగా 274 శాతం పెరిగిపోయాయంటే పన్నుల భారం ఏ స్థాయిలో ఎక్కువైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని గత యూపీఏ సర్కారు హయాంలో చివరి ఆర్థిక సంవత్సరమైన 2013-14లో రూ.7.22 లక్షల కోట్లుగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లుంటే.. గత ఆర్థిక సంవత్సరం (2024-25) రూ.27.03 లక్షల కోట్లుగా ఉన్నాయి.

### కొత్త పన్ను విధానంతో..

కొత్త ఆదాయ పన్ను విధానంతో పన్ను మినహాయింపులు, కోతలకు తావు లేకుండా చేశారని కేంద్ర ప్రభుత్వంపై పలువురు ఆర్థిక నిపుణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాత పన్ను విధానంలో సేవింగ్స్‌కు, పెట్టుబడులకు ప్రాధాన్యత ఉండేదని, దీంతో దేశం పొదుపు దిశగా నిర్మాణాత్మకంగా అడుగులేసిందని పేర్కొంటున్నారు. అయితే ప్రతీ బడ్జెట్‌లో పాత పన్ను విధానానికి స్వస్తి పలికేలా.. కొత్త పన్ను విధానంలోనే మార్పులు చేస్తున్నారని, ఇది సరికాదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. ఖజానాను నింపుకోవడానికి ప్రజలపై పన్నుల భారాన్ని మోపడం తగదని చెప్తున్నారు. నిజానికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు కూడా ఏటేటా పెరుగుతూపోతున్న సంగతి విదితమే. దీంతో అటు ప్రత్యక్ష, ఇటు పరోక్ష పన్నుల్ని ప్రజానీకం నుంచి సర్కారు పిండుకుంటున్నట్టవుతున్నది.

### రిఫండ్స్ విషయానికొస్తే..

ఈ 11 ఏండ్లలో రిఫండ్స్ కూడా 474 శాతం పెరిగినట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు చెప్తున్నది. 2013-14లో రూ.83,008 కోట్లుగా ఉన్న రిఫండ్స్.. 2024-25లో రూ.4,76,743 కోట్లుగా ఉన్నట్టు తేలింది. 2014 నుంచి ఇప్పటిదాకా చూసినైట్టెతే ఐటీ రిటర్న్లు దాఖలుచేసేవారు 133 శాతం పెరిగారు. 2024-25లో 8.89 కోట్లకుపైగా ట్యాక్స్‌పేయర్స్ ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నులను దాఖలు చేశారు. 2013-14లో 3.8 కోట్లుగానే ఉన్నారు. కాగా, గత 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి జూలై 10 వరకు రిఫండ్స్ అనంతరం నికర ప్రత్యక్ష పన్నుల ఆదాయం రూ.73,893 కోట్లుగా ఉన్నది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి జూలై 10దాకా రూ.1.02 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఈసారి రూ.6.65 లక్షల కోట్లుగా, పోయినసారి రూ.6.44 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రిందటితో పోల్చితే 3.17 శాతం పెరిగాయి.

### ఇండియన్ విద్యార్థులకు గూగుల్ బంపరాఫర్..

## ఏడాది పాటు అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్ ఫ్రీ..ఫ్రీ..!

గూగుల్ అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్ ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునేందుకు భారతీయ విద్యార్థులకు అవకాశం కల్పిస్తోంది. దాదాపు రూ. 19,500 ధరకు లభించే ఈ ప్లాన్, హోంవర్క్, రైటింగ్, వీడియో జనరేషన్ టూల్స్ భారతీయ విద్యార్థులకు మాత్రం ఉచితంగానే యాక్సెస్ అందిస్తుంది. జెమినీ ఫర్ స్టూడెంట్స్ పేరిట.. హైదరాబాద్, జులై 17: ఇండియన్ విద్యార్థులకు గూగుల్ అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది. గూగుల్ అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్ ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. దాదాపు రూ. 19,500 ధరకు లభించే ఈ ప్లాన్, హోంవర్క్, రైటింగ్, వీడియో జనరేషన్ టూల్స్ భారతీయ విద్యార్థులకు మాత్రం ఉచితంగానే యాక్సెస్ అందిస్తుంది. జెమినీ ఫర్ స్టూడెంట్స్ పేరిట ఈ అవకాశాన్ని అందిస్తుంది. 18 ఏళ్లు అంతకు పై వయసు కలిగిన విద్యార్థులు ఏడాది పాటు %+శీశీస్త్రశ్రీవ ూ× ్రాతీశీ% ప్లాన్ ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందొచ్చుట. ఇందులో 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ కూడా ఉచితంగా లభిస్తుంది. జెమినీ సేవలను ఉపయోగించుకోవడానికి విద్యార్థులు ముందుగా గూగుల్ ఆఫర్ పేజీ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. నమోదుకు సెప్టెంబరు 15, 2025వ తేదీని చివరి తేదీగా గూగుల్ నిర్ణయించింది. ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత గూగుల్లో పవర్‌ఫుల్ ఏఐ మోడల్ అయిన జెమినీ 2.5 ప్రోను ఉపయోగించుకోవచ్చు. సబ్‌స్క్రిప్షన్‌లో చేరిన తర్వాత జెమిని 2.5 ప్రో, దాని వీడియో జనరేషన్ మోడల్ అయిన 3 వంటి విస్తృత శ్రేణి ప్రీమియం ఫీచర్లు వినియోగించుకోవచ్చు. ఈ ప్లాన్‌లో డాక్స్, ఇతర యాప్‌లలో 2% క్లౌడ్ స్టోరేజ్, ఫీచర్లు కూడా ఉంటాయి. ఈ ప్లాన్‌లో చదువుకోవడానికి, రైటింగ్ రీసెర్చ్ ఉద్యోగానికి కావల్సిన టూల్స్ ఉన్నాయి. పరీక్షలు, హోంవర్కులు, వ్యాసరచన, కోడింగ్,




ముఖాముఖీలకు అన్‌లిమిటెడ్ అకడమిక్స్ పోర్ట్ ఉపయోగపడుతుంది. హోంవర్క్ హెల్ప్ పరీక్ష తయారీ.. సహాయంతో 1500 పేజీల వరకు ఉన్న పాఠ్యపుస్తకాలను విశ్లేషించవచ్చు. స్టడీ సపోర్ట్.. పొడవైన పాఠ్యపుస్తకాలను (1500 పేజీల వరకు) విశ్లేషించవచ్చు. పరీక్షల సమయంలో దీని సహాయం పొందవచ్చు. చిత్తుప్రతులను రూపొందించడానికి, ఎస్సేలను మెరుగుపరచడానికి, ఆలోచనలను నిర్వహించడానికి ఉపయోగపడుతుంది వీడియో క్రియేషన్.. లోని 3 వ్యవస్థ ద్వారా టెక్స్ట్, ఇమేజ్‌లను చిన్న వీడియోలుగా మార్చవచ్చు. నోట్‌బుక్ ఎల్ఎమ్.. మరిన్ని ఆడియో, డాక్యుమెంట్ సారాంశాలతో మెరుగైన పరిశోధన అంశాలు తోడ్పడతాయి. జెమిని ఇంటిగ్రేషన్.. డాక్స్, షీట్‌లు ఇతర యాప్‌లలో ప్రత్యక్ష సపోర్ట్ ఉంటుంది. క్లౌడ్ స్టోరేజ్.. అసైన్‌మెంట్‌లు, ప్రాజెక్ట్‌లు, మీడియా ఫైల్‌లను నిల్వ చేయడానికి డ్రైవ్, ఫోటోలకు 2 టీబీ వరకు స్టోరేజ్ ఉంటుంది.

